


# శివసూర్య


SHIVA SURYA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704




శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.



కర్నూలు సంపుటి : 04, సంచిక : 20 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ బుధవారం - 30 - సెప్టెంబర్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## విద్యుత్ బిల్లులో ఈ-చలాన్లు.. వసూళ్లపై సుప్రీం కీలక సూచన




ట్రాఫిక్ చలాన్ల వసూలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఈ-చలాన్లను కరెంట్ బిల్లులో కలిపేయాలని సూచన

దేశవ్యాప్తంగా రూ.45 వేల కోట్ల చలాన్లు పెండింగ్

చలాన్లు కట్టనివారికి ఆర్సీ రెన్యువల్ నిలిపివేయాలని సలహా

ఢిల్లీ: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనదారుల నుంచి ఈ-చలాన్ల వసూలు

## యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా.. భారత్ కీలక నిర్ణయం!




క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు

ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు

యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం

డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి

సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక

## రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో ‘పల్లె పండుగ 3.0’ ప్రారంభం

- గ్రామసీమల అభివృద్ధికి ‘పల్లె పండుగ 3.0’.. రామాపురంలో లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్
- నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శ్రీకారం
- 15,500 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.10,250 కోట్లు కేటాయింపు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మిగతా 2 లో

# అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు

### విజయవాడలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్‌షాప్

- ★ ఉద్యోగుల సామర్థ్య పెంపులో ఏపీకి జాతీయ స్థాయిలో తొలి ర్యాంక్
- ★ విజేతలకు అవార్డులు అందజేసి ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- ★ సాంకేతికత, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న సీఎం
- ★ రెండో స్థానంలో కర్ణాటక, మూడో స్థానంలో ఒడిశా




అమరావతి: అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అమెరికాకు వందేళ్ల పడితే, ఆసియా దేశాలకు ఆరు నుంచి ఏడు దశాబ్దాలు పడితే, చైనాకు 45 ఏళ్ల పట్టిందని, కానీ నేటి భారత్‌కు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి 20 ఏళ్ల చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగతా 2 లో

## ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక




ఆరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న విపత్తుల నిర్వహణ సంస్థ

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల వేళ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన




## ఎన్నికల ‘మ్యాచ్ ఫిక్సింగ్’.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో ‘మ్యాచ్ ఫిక్సింగ్’ జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ

ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్

13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు

### నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

## కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. మిగతా 2 లో

### చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో

## గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

### ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమం ప్రారంభం

రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్

గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి

రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం

అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు



అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు మిగతా 2 లో




## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

### మంత్రి పొన్నం ప్రభాకర్

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు

# కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది

### అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలి

- దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది
- ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారు
- ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం
- రాష్ట్రంలో ఉన్న సామర్థ్యాన్ని అక్కడి స్థానిక వనరులు, మానవ వనరులతోనే అభివృద్ధి చేసే విధంగా కేంద్రం ప్రోత్సహించాలి




ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మిగతా 2 లో

## చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారు




- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని

### విద్యుత్ బిల్లులో ఈ-చలాన్లు..
## వసూళ్లపై సుప్రీం కీలక సూచన

ఢిల్లీ: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనదారుల నుంచి ఈ-చలాన్ల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. పేరుకుపోయిన చలాన్ల మొత్తాన్ని వాహనదారుల విద్యుత్ బిల్లులకు జోడించి వసూలు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దేశంలో ప్రస్తుతం అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతుల ద్వారా వసూళ్లు చేయడం కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో దాదాపు రూ.45 వేల కోట్ల విలువైన ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే వసూలైనట్లు సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఈ భారీ బకాయిలపై జస్టిస్ పార్దివాలాతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. “ఒకే మార్గంలో వసూలుచేయాలంటే ఈ దేశంలో సాధ్యం కాదు. ఈ-చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులతో అనుసంధానించండి” అని వ్యాఖ్యానించింది. చలాన్లు చెల్లించని వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోర్టు సూచించింది. అటువంటి వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) పునరుద్ధరణను నిలిపివేయడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీని నిరాకరించడం వంటి చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. బకాయి వసూలు కోసం అధికారులు వినూత్నమైన, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలు అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని ఆయన చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

### ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన..
## అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం.. ప్రధానంగా ఆరు జిల్లాల్లో వర్ష ప్రభావం ఉండనుంది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో మంగళవారం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది. వీటితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఇతర జిల్లాల్లోనూ కొన్నిచోట్ల చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురవవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలకు అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున స్థానిక పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

### భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం..
## పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు..

ఢిల్లీ: భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది. ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. అయితే, ఎల్ఎన్‌జీ కూడా శిలాజ ఇంధనమే కావడంతో ఇది పూర్తిస్థాయిలో కాలుష్యరహిత రైలు కాదు. కానీ, విద్యుదీకరణ పూర్తికాని మార్గాల్లో డీజిల్ వాడకాన్ని, నిర్వహణ ఖర్చులను తగ్గించడం, కర్బన ఉద్గారాలు, నైట్రోజన్ ఆక్సైడ్‌ల విడుదలను నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇటీవల ప్రవేశపెట్టిన హైడ్రోజన్ రైలుకు, ఈ ఎల్ఎన్‌జీ రైలుకు సాంకేతికంగా కీలకమైన వ్యత్యాసం ఉంది. హైడ్రోజన్ రైలులో ఫ్యూయల్ సెల్స్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నడిపిస్తే, ఈ ఎల్ఎన్‌జీ రైలులో మాత్రం సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌నే డ్యూయల్ ఫ్యూయల్ కోసం మార్పులు చేసి వినియోగిస్తున్నారు.

## యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా.. భారత్ కీలక నిర్ణయం!

ఢిల్లీ: యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.

ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ

ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.

పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావం

ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.

యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకం

దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

ఇక పోటీ తప్పనిసరి

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

## స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు.. ఏపీ ఎన్నికల సంఘం కీలక ప్రకటన

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో రెండు నెలల సమయం పడుతుందంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నేడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలు, రాజకీయ పార్టీలు వీటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లకు సంబంధించిన కోర్టు కేసులలో స్పష్టత వచ్చాకే కమిషన్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుందంటూ జరుగుతున్న ప్రచారం తమ దృష్టికి వచ్చిందని పునేఠా తెలిపారు. ఎన్నికలు ఆలస్యమైనా, అంతర్గత ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయని కూడా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వార్తలన్నీ కల్పితమైనవని, కమిషన్ అధికారికంగా జారీ చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మడం గానీ, ఇతరులకు పంపడం గానీ చేయవద్దని సూచించారు. కమిషన్ పేరుతో తప్పుడు, కల్పిత సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఏదైనా ప్రకటన ఉంటే, అది కేవలం అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా పత్రికా ప్రకటన ద్వారా మాత్రమే వెల్లడిస్తామని స్పష్టం చేసింది. వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌తో సరిచూసుకున్నాకే విశ్వసించాలని కోరింది. ఇటీవలే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి ప్రారంభించింది. మరోవైపు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూడా ఎస్ఈసీ సన్నాహాలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సెప్టెంబర్ 23తో మండల ప్రజా పరిషత్‌లు, సెప్టెంబర్ 24తో జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో
## ‘పల్లె పండుగ 3.0’ ప్రారంభం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు. ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మొత్తం రూ.10,250 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,500 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో రూ.7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉన్నాయి. రహదారులతో పాటు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పలు ఇతర పనులకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు (పశువుల షెడ్లు), పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లు, పచ్చదనం పెంపు కోసం రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యానవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవే కాకుండా, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.200 కోట్లు కేటాయించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతమివ్వడంతో పాటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### ఎన్నికల ‘మ్యాచ్ ఫిక్సింగ్’..
## ప్రధాని మోదీ రాజీనామా చేయాలి




ఢిల్లీ: ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న ‘మ్యాచ్ ఫిక్సింగ్’గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ‘ఓట్ల దొంగతనానికి’ పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక ‘ప్రతిఘటన’ పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### చౌకగా లభించే సింగరేణి బొగ్గును
## కాదని విదేశీ బొగ్గు కొంటున్నారు

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో ‘తుగ్లక్ నిర్ణయం’గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ‘ఎక్స్’ ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

### నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..
## కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

## కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది

హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలన్నారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. అసోం దినపత్రిక ‘ప్రతిదిన్’ మీడియా నెట్‌వర్క్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ‘ది కాంక్లేవ్ 2026’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ‘India's Next Chapter’ అంశంపై జరిగిన చర్చలో దేశ భవిష్యత్ దిశ, విద్య, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సర్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి గారు విస్తృతంగా మాట్లాడారు. దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒక రాష్ట్రంలో ఉన్న సామర్థ్యాన్ని అక్కడి స్థానిక వనరులు, మానవ వనరులతోనే అభివృద్ధి చేసే విధంగా కేంద్రం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులు వంటి కేంద్రం వద్ద సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల విషయాన్ని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావిస్తూ, జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో రాజకీయంగా నష్టం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 1976లో నియోజకవర్గాల సంఖ్యను స్థిరీకరించిన నిర్ణయం, ఆ తర్వాత జరిగిన పరిణామాలను ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని అన్నారు. దేశ రాజకీయాల్లో సంఖ్యాబలం కీలకమని, లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో దక్షిణాది రాష్ట్రాల వాదన బలహీనపడుతుందని విశ్లేషించారు. తెలంగాణను.. విద్య, నైపుణ్యాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా అభివృద్ధి చేసి, దేశ ప్రగతిలో రాష్ట్రాన్ని కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి గారు తెలిపారు. యువతకు విద్యతో పాటు అవసరమైన నైపుణ్యాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, నర్సరీ విద్య వంటి అంశాలపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రాంతీయ భాషతో పాటు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేలా విద్యా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని, 12వ తరగతి తర్వాత విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు.

## అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు: సీఎం చంద్రబాబు

అమరావతి: అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అమెరికాకు వందేళ్లు పడితే, ఆసియా దేశాలకు ఆరు నుంచి ఏడు దశాబ్దాలు పడితే, చైనాకు 45 ఏళ్లు పట్టిందని, కానీ నేటి భారత్‌కు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి 20 ఏళ్లు చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. సరైన నాయకత్వం, సాంకేతికత, అపారమైన యువశక్తితో ఈ అద్భుతాన్ని సాధించగల సత్తా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో మంగళవారం జరిగిన ‘మిషన్ కర్మయోగి’ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడంలో (కెపాసిటీ బిల్డింగ్) దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఇదే విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన కర్ణాటక, తృతీయ స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాల ప్రతినిధులకు కూడా ఆయన అవార్డులు అందజేశారు.

భవిష్యత్తు మనదే.. మార్పు అనివార్యం

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “భారత్ ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన దశలో ఉంది. మనకు జ్ఞానం, సాంకేతికత, అపారమైన అవకాశాలు ఉన్నాయి. మన యువతలో అసాధారణమైన ఆకాంక్షలు ఉన్నాయి. ఈ ఆకాంక్షలను నెరవేర్చేందుకు మన పరిపాలనా వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా? అన్నదే అసలైన ప్రశ్న. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం” అని విశ్లేషించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో మార్పులు చూశానని, ఒకప్పుడు కరెంట్, రోడ్లు, కనీసం ట్యాప్ వాటర్ కూడా లేని గ్రామం నుంచి తాను వచ్చానని గుర్తుచేసుకున్నారు. పదుల గ్రామాలకు కలిపి ఒకే ఒక్క టెలిఫోన్ ఉండేదని, అది కూడా పనిచేసేది కాదని నాటి పరిస్థితులను వివరించారు.

### సాంకేతికతతో సుపరిపాలన

అలాంటి రోజుల నుంచి నేడు డిజిటల్ ఇండియా వరకు దేశం ఎంతో మారిందన్నారు. “గతంలో ఒక ఫైల్ ముందుకు కదలాలంటే ఎల్‌డీసీ నుంచి అదనపు కార్యదర్శి వరకు 15 నుంచి 20 స్థాయిలు దాటాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఫైళ్లు కనపడక రోజుల తరబడి వెతకాల్సి వచ్చేది. కానీ ఈ-ఆఫీస్ విధానంతో ఇప్పుడు నిమిషాల్లో ఫైళ్లను క్లియర్ చేయగలుగుతున్నాం. నేను కూడా రోజుకు 15-20 నిమిషాల్లో ఫైళ్లను పూర్తి చేస్తున్నా” అని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో అంగన్‌వాడీ టీచర్ కూడా తనకంటే మెరుగ్గా ఉన్నారని ప్రశంసించారు. రియల్ టైం గవర్నెన్స్, డేటా లేక్, కృత్రిమ మేధ (ఊ×), డ్రోన్లు, సెన్సార్ల వాడకంతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సేవలను చేరవేయడమే లక్ష్యమని వివరించారు.

పిల్లి నల్లదా తెల్లదా అనేది ముఖ్యం కాదు.. ఎలుకను పట్టడమే ముఖ్యం!

ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ‘మిషన్ కర్మయోగి’ ఒక అద్భుతమైన సంస్కరణ అని చంద్రబాబు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతోందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ 4,200 కోర్సులు పూర్తి చేసి, జాతీయ స్థాయిలో 14,500 క్రెడిట్లు సాధించడం దీని విజయానికి నిదర్శనమన్నారు. చైనా ఆర్థిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, “పిల్లి నల్లదా, తెల్లదా అన్నది ముఖ్యం కాదు, అది ఎలుకలను పడుతుందా లేదా అన్నదే ముఖ్యం” అనే డెంగ్ షియావోపింగ్ సూక్తిని గుర్తుచేశారు. ఫలితాలు రాబట్టడమే మన అంతిమ లక్ష్యం కావాలన్నారు.

### స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌ను ‘స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047’గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటును 15 శాతానికి పైగా సాధించే సత్తా ఏపీకి ఉందన్నారు. “ఆంధ్రప్రదేశ్‌ను మిగతా రాష్ట్రాలకు ఒక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా (=ഥണ జవత్‌వతీ), ఒక ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌గా నిలబెడతాం. ఇక్కడ విజయవంతమైన నమూనాలను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా చేస్తాం” అని ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధిని జోడించి సంపద సృష్టించి, ఆ ఫలాలను నిరుపేదలకు అందించడం ద్వారా అసమానతలను తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని నదుల అనుసంధానం పూర్తయితే భారత్‌ను ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు. అంతిమంగా మనమంతా భారతీయులమని, పార్టీలు, ప్రాంతాలు వేరైనా దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నదే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. “వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి” అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

### రూ.11,085 కోట్లతో ‘పల్లె పండుగ 3.0’

‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. “మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి” అని కోరారు. రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఉరుకుంద మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చన్న బసప్ప



కౌతాళం ప్రతినిధి (శరణ బసవ)సెప్టెంబర్ 29 (శివ సూర్య న్యూస్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చన్న బసప్ప మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా చన్న బసప్ప మంత్రి లోకేష్‌కు స్థానిక నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ, సామాజిక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ప్రాధాన్యత ఇస్తుండటం పట్ల చన్న బసప్ప హర్షం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, అలాగే స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కౌతాళంలో సజావుగా ముగిసిన పాఠశాల కమిటీ ఎన్నికలు

కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్లు సభ్యులు



కౌతాళం ప్రతినిధి (శరణ బసవ), సెప్టెంబర్ 29: (శివ సూర్య న్యూస్)మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన పాఠశాల కమిటీ ( ఎస్ఎంసి) ఎన్నికలు మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఉలిగయ్య, మండల అధ్యక్షులు సురేష్ నాయుడు ఆదేశాల మేరకు నేడు మండల పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్ కిష్టప్ప వైస్ చైర్మన్ రేణుక, కస్తూరిబా గాంధీ చైర్మన్ నాగమ్మ వైస్ చైర్మన్ కురువ లక్ష్మి, కన్నడ ఎంపీపీ, చైర్మన్ దేవేంద్ర వైస్ చైర్మన్ బసవరాజ్ తెలుగు ఎంపీపీ చైర్మన్ దేవదాస్ వైస్ చైర్మన్ సునంద, పింజరి వీధి చైర్మన్ అబ్బా సాలి వైస్ చైర్మన్ ఈరేష్ ఎంపీపీ పాఠశాలల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు మరియు కమిటీ సభ్యుల ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడానికి మరియు సజావుగా ముగిసేందుకు సహకరించిన కూటమి పార్టీల నాయకులకు, నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు, పాఠశాలల ఉపాధ్యాయ బృందానికి మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన పాఠశాల కమిటీ చైర్మన్లు, సభ్యులు నిరంతరం పాఠశాలలను సందర్శిస్తూ, ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు అందిస్తూ విద్యాసంస్థల సమగ్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్, టౌన్ అధ్యక్షులు డాక్టర్ రాజనంద్ ఎంఈఓ వన్ రామాంజనేయులు ఎంఈఓ టూ శోభ రాణి ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపల్ పుష్పలత నాయకులు అధికారులు ఉపాధ్యాయుల తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

# గజ్జెహాళ్లి హై స్కూల్లో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గా: శర్మే ఖాసీంవలి,

వైస్ చైర్మన్గా మాలగౌరమ్మ ఎన్నిక..!

ఎంపీపీ స్కూల్లో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గా రాములమ్మ,వైస్ చైర్మన్ గా బోయ ఎర్రిస్వామి ఎన్నిక..!



హోళగుంద: శివ సూర్య న్యూస్, సెప్టెంబర్ 29 : మండలం పరిధిలోని గజ్జెహాళ్లి గ్రామంలో హై స్కూల్ మరియు ఎంపీపీ స్కూల్ నందు మంగళవారం తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు ఎస్ఎంసీ ఎన్నికలు మంగళవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల సమక్షంలో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు



జరిగాయి. ఈ ఎన్నికలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గా షర్మే ఖాసీంవలి ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్ గా మాల గౌరమ్మ ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి ప్రకటించారు తదనంతరం ఎంపీపీ పాఠశాల నందు ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమక్షంలో ఎస్ఎంసి ఎన్నికలు జరిగాయి. పాఠశాల పేరెంట్స్ స్ చైర్మన్గా రాములమ్మ, వైస్ చైర్మన్గా బోయ ఎర్రి స్వామి ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రావణి వెల్లడించారు. అనంతరం నూతన చైర్మన్లను , వైస్ చైర్మన్ లను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రసాభాసగా హై స్కూల్ కమిటీ ఎన్నిక..!

తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా, వినతి పత్రం అందజేత..




హొళగుంద :శివసూర్య న్యూస్ సెప్టెంబర్ 29 : స్థానిక మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నిక రాసాభస గా జరిగింది ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపాన్ని పట్టించుకోకుండా ఏకపక్షంగా కొందరు వ్యక్తుల నిర్ణయాల మేరకు ఎస్ ఎం సి ఎన్నికలు అధికారులు నిర్వహించడంతో ఎన్నికలో పోటీ చేయడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు నిరసనను తెలుపుతూ సమావేశ మందిరంలో నుండి ఎన్నికను బహిష్కరించి బయటకు లేచి వచ్చారు. తమను పట్టించుకోనప్పుడు సమావేశానికి ఎందుకు పిలిచారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 50% కోరం లేకపోయినా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకీయాలకు తలవంచారని ఎన్నిక జరపకుండా ముందే సిద్ధం చేసుకున్న పేర్లను చదివి ఎన్నికైనట్లు ప్రకటించారని ఆరోపించారు. కనీసం ఎవరు పోటీ చేస్తారు అని విద్యార్థుల తల్లిదండ్రులను అడగలేదని పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు ఎన్నికల నియమ నిబంధనలను కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయలేదని పేర్కొన్నారు. తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి కోరం లేకుండా నిర్వహించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి ఎన్నికను రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తు కోసం స్వచ్ఛందంగా ఎస్ ఎం సి ఎన్నికల్లో పాల్గొనేలా విద్యార్థుల తల్లిదండ్రులు అందరికీ భాగస్వామ్యం కల్పిస్తూ ఎస్ ఎం సి ఎన్నికలను మరల నిర్వహించాలని డిమాండ్ చేశారు. తమ వినతి పత్రాన్ని తాసిల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కు అందజేసి జిల్లా కలెక్టర్కు పంపించి ఎస్ఎంసి ఎన్నికను మరల జరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 103 పాఠశాలల్లో ఎస్.ఎం.సి ఎన్నికలు పూర్తి

--- 99 చోట్ల ఏకగ్రీవం,4 చోట్ల ఓటింగ్, మరో మూడు పెండింగ్




మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 29: మెళియాపుట్టి మండలంలోని106 పాఠశాలలకు గాను 103 పాఠశాలల్లో ఎస్.ఎం.సి ఎన్నికలు మంగళవారం సజావుగా పూర్తయ్యాయని మండల విద్యాశాఖ అధికారులు సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభరావు తెలిపారు. ఇందులో 99 పాఠశాలల్లో



ఏకగ్రీవంగా, 4 చోట్ల ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరిగాయని, మరో 3 పాఠశాలల్లో ఎన్నికలు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఎన్నికలు తమ ఆధ్వర్యంలో ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగాయన్నారు. 2026 నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఎన్నికలు విజయవంతానికి సహకరించిన ఎంపీడీఓ నరసింహ పండా, ఇంచార్జి తహసీల్దార్ రాము, ఎస్.ఐ అమీర్ అలీ, వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజన ప్రాంతాల సమస్యలను మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన

ఎమ్మెల్యే మామిడి గోవిందరావు





మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 29: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), సీతంపేటలో నిర్వహించిన 78వ పాలకవర్గ సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కొత్తూరు మండలం అబలాసింగి గ్రామంలో విద్యార్థులకు నూతన పాఠశాల భవనం కల్పించాలని కోరారు. అదేవిధంగా మెట్టూరు గ్రామం నుండి లబ్బ గ్రామం వరకు రోడ్డు పూర్తిగా పాడవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని,



వెంటనే రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల నుండి గిరిజనులు తమ సమస్యలను తెలియజేయడానికి సీతంపేట ఐటీడీఏ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని, అయితే సరైన బస్సు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఆయా మండలాల నుండి సీతంపేటకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, విద్యా సదుపాయాల మెరుగుదల, రవాణా సౌకర్యాల కల్పనతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ గారికి విజ్ఞప్తి చేశారు.

# పోలీస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న ---ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 29: జిల్లా కేంద్రంలోని తాండ్యాంవలస డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్( డిపిటిసి) లో పది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 142 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు



అభినందనలు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం -- అంగన్‌వాడీ కార్యకర్తలు



నందవరం,శివసూర్య,, సెప్టెంబర్ 29:నాగులదిన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం--4లో సోమవారం 'అంగన్‌వాడీ ఉత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తల్లులు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యపై అవగాహన పెంపొందించడమే



ఉత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ విద్య ద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికి పునాది వేస్తున్నట్లు తెలిపారు. పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశు భ్రతపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. సమాజ భాగస్వామ్యంతో అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి తల్లీబిడ్డలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# అభివృద్ధికి ఓటేసిన తల్లిదండ్రులు -- విద్యా కమిటీ చైర్మన్ భీమన్న

## రెండోసారి విద్యా కమిటీ చైర్మన్గ గా ఎన్నిక



ఎమ్మిగనూరు,శివసూర్య, సెప్టెంబర్ 29:అభివృద్ధికి కేజీబీవి విద్యార్థుల తల్లిదండ్రులు ఓటేశారని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ భీమన్న తెలిపారు. మంగళవారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో భీమన్న రెండోసారి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోసారి చైర్మన్‌గా ఎన్నిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రెండేళ్ల క్రితం తొలిసారి చైర్మన్‌గా అవకాశం కల్పించిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేశానని తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి



పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు దాతల సహకారంతో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా దాతలు,సొంత నిధుల సహకారంతో ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఫర్నిచర్‌ను పాఠశాలకు అందించినట్లు వివరించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా, క్రీడా అభివృద్ధికి తనవంతు సహకారం అందించానన్నారు. గత రెండేళ్లలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించిన విద్యార్థుల తల్లిదండ్రులు మరోసారి తనకు అవకాశం కల్పించడం బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి చైర్మన్‌గా ఎన్నుకున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రెండేళ్లలో పాఠశాలలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దాతలు, ప్రజల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ మండల అధ్యక్షులు ఖాసింవలి,సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్ , టిడిపి నందవరం గ్రామ అధ్యక్షులు భీమ శేఖర్ హాజరై భీమన్నను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, మిత్రులు భీమన్నను సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, మిత్రులకు భీమన్న కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల విద్యా కమిటీ విజేతలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 29:పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సోమవారం జరిగిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజేతలను దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజయం సాధించాలి.

## - జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు.



కర్నూల్ స్పోర్ట్స్, శివసూర్య, సెప్టెంబర్ 29: కర్నూల్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కర్నూల్ జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్. 19 ఏళ్ల లోపు క్రీడాకారుల కోసం నిర్వహించిన టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి అతిథిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ నిత్యం క్రీడలు సాధన చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు శాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విజయ్ భాస్కర్ రెడ్డి




క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చదువుతోపాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా విద్యార్థులు రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రియాజుద్దీన్ , రాఘవేంద్ర , నాగశేషులు, ప్రకాష్ , కిరణ్ కుమార్ , పరుశ రాముడు, శేఖర్ , ప్రతిభ , జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నరు.

# సమస్యలు గుర్తించి అధికారులకు వినతిపత్రం అందించిన సరోజిని నాయుడు బాలల పార్లమెంట్ సభ్యులు



తాడేపల్లి,శివసూర్య, సెప్టెంబర్ 29:తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో ఉన్న సరోజిని నాయుడు బాలల పార్లమెంట్ సమావేశం 29--9--2026 మంగళవారం జరిగినది. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పిల్లలు గుర్తించిన సమస్యలు గురించి సచివాలయం సిబ్బందికి వినతి పత్రం అందించటం జరిగినది. ఈ సమావేశంలో గుండిమెడ గ్రామంలో ఉన్న సమస్యలను పిల్లలు గుర్తించి ఆ సమస్యల గురించి సచివాలయం సెక్రెటరీ జె. అశోక్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామంలో పిల్లలకు లైబ్రరీ కావాలని డ్రైనేజ్ కాలువలు పూడిక తీయక దోమలు ఎక్కువగా పెరుగుతున్నాయని మురుగు కాలువలు పూడిక తీసి బ్లీచింగ్ చల్లించాలని వడ్డేస్వరం గ్రామం నుండి గుండెమెడ వచ్చే కొత్త రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కె.ఎల్.యూనివర్సిటీ విద్యార్థులు బైక్ లుపై చాలా స్పీడ్ గా గ్రామంలో ప్రయాణం చేస్తున్నారు అని రోడ్లపై స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని అర్జీ ద్వారా విన్నవిన్నవించుట జరిగినది. పిల్లలకు ఇలాంటి మంచి విషయాలు నేర్పించి, సమాజం పట్ల బాధ్యతా భావం మరియు గౌరవ భావాలు కలిగేలా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం గొప్ప విషయమని గ్రామ ప్రజలు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ సేవలను అభినందించారు. ఈ విషయాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని సచివాలయం సెక్రటరీ అశోక్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు సరోజిని నాయుడు బాలల పార్లమెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు మందులు, టీకాలు అందడం లేదని ఆరోపణలు

మొయినాబాద్ పీహెచ్‌సీలో వైద్య సేవలపై స్థానికుల ఆందోళన



చేవెళ్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 29 )మొయినాబాద్ : మొయినాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు అందాల్సిన వైద్య సేవలపై నిర్లక్ష్యం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని నెలలుగా గర్భిణీలకు అవసరమైన మందులు, ఐరన్--ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఇతర ఔషధాలు, పోషకాహార కిట్లు, టీకాలు సక్రమంగా అందడం లేదని వారు పేర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన మందులు, వైద్య సామగ్రి అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై స్థానికులు మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణను ప్రశ్నించగా, కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి మందులు, ఇతర వైద్య సామగ్రి సరఫరా కావడం లేదని ఆమె తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. గర్భిణీలకు అవసరమైన మందులు, టీకాలు అందకపోవడాన్ని సాధారణ సమస్యగా చూడలేమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే అవసరమైన వైద్య సేవలు అందుబాటులో లేకపోతే పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఎలా ఉపయోగపడుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. గర్భిణీలకు అందాల్సిన వైద్య సేవలు నెలల తరబడి సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మందులు, టీకాలు, అవసరమైన వైద్య సామగ్రిని తక్షణమే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఇంతకాలం సరఫరా ఎందుకు నిలిచిపోయిందనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. గర్భిణీల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజా ఉద్యమం చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.

## టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

## గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి..

## జెండా ఆవిష్కరణలో గొంగళ్ల రంజిత్ కుమార్





కేటీదొడ్డి తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. కేటీదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ జెండా పండుగ సందర్భంగా నూతన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంజిత్ కుమార్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ప్రకటించిన పాంచజన్యంలో పేర్కొన్న విద్య, వైద్యం, అభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు, పేదలు, కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కేటీదొడ్డి మండలంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు యువత, ప్రజలను పార్టీతో అనుసంధానం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సుభాష్, రేణప్ప, ఉరుకుందు, అంజి, గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు, వెంకట్రాములు, బత్తలయ్య, శివన్న, మల్దకల్ మండల నాయకులు విష్ణు, ప్రేమరాజ్, గోపాల్, లక్ష్మన్న, గొర్ల తిమ్మప్ప, ధరూర్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలను సందర్శించిన బిజెపి నాయకులు:



చొప్పదండి మండలం, సెప్టెంబర్ 29 భారతీయ జనతా పార్టీ చొప్పదండి పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు పెంచికాల రమాదేవి ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చొప్పదండి పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు



గుర్రాల నిర్మల రెడ్డి మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ, ఆరోగ్యం, మహిళలకు సంబందించిన పథకాల గురించి పిల్లలకు వారి తల్లులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు బాల్యం లో ఉన్న పిల్లలను బడికి చేర్చే గొప్ప ప్రదేశమని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ గారు అన్ని వర్గాలకు సేవ చేయాలనే లక్ష్యంతో 25 సంవత్సరాలుగా దేశ ప్రజలకు సంక్షేమ పథకాలు క్రింది స్థాయి వరకు అందేలా నిరంతరం పని చేస్తున్నారని, అందులో భాగంగానే అంగన్వాడి కేంద్రంలోని టీచర్లను, మరియు ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకుంటున్నామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి అంగన్వాడీ టీచర్లను, ఆయాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి జిట్ట కుమార్, బీజేవైయం జిల్లా కార్యవర్గ సభ్యులు మంచికట్ల మల్లేశ్, పెద్ది రేణుక, నూనె జ్యోత్స్న,బుర్ర లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలలో నూతన బోరు పనులు ప్రారంభం

ఎంపీ నిధులతో రూ.80 వేల మంజూరు.. తాగునీటి సమస్యకు పరిష్కారం



అశ్వరావుపేట ఆర్సి / సెప్టెంబర్ 29: ములకలపల్లిమండలంలోని మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ప్రారంభించారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తన ఎంపీ నిధుల నుంచి రూ.80 వేల నిధులను బోరు ఏర్పాటుకు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి కొబ్బరికాయ కొట్టి బోరు పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఏకలవ్య పాఠశాలలో గత కొంతకాలంగా తాగునీటి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారని చెప్పారు. వెంటనే స్పందించిన ఎంపీ రూ.80 వేల నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నూతన బోరు అందుబాటులోకి వస్తే పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు తాగునీటి సమస్య తీరుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్‌కు గ్రామ పంచాయతీ, విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్ కుమార్, వార్డు సభ్యుడు కనితి చిన్న వెంకటేశ్వర్లు, పాఠశాలఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మొయినాబాద్ మున్సిపాలిటీలో

## 96వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

హామీలు కాదు.. కేటాయించిన ఇంటి స్థలాలు ఇవ్వాలి



చేవెళ్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 27 )మొయినాబాద్ : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష 96వ రోజుకు చేరుకుంది. నాలుగు యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రజలు శాంతియుతంగా దీక్ష కొనసాగిస్తున్నారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో 290 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసింది. పట్టాలు మంజూరైన అనంతరం లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి పునాదులు కూడా ప్రారంభించారు. అయితే సర్వే నంబర్ 151లో రహదారి విషయమై కోర్టులో కేసు దాఖలు కావడంతో అప్పటి నుంచి ఇప్పటివరకు లబ్ధిదారులకు తమకు కేటాయించిన ఇంటి స్థలాలపై పూర్తి స్థాయిలో స్వాధీనం కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాలు మంజూరు చేసి సంవత్సరాలు గడుస్తున్నా స్థలాలు అప్పగించకపోవడంతో పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిసరాల్లో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ వాటిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆందోళనకారులు ఆరోపించారు. తమకు కేటాయించిన ఇంటి స్థలాలను వెంటనే స్వాధీనం చేసి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మాకు కేటాయించిన ఇంటి స్థలాలు మాకు ఇచ్చేవరకు మా పోరాటం ఆగదు. ఇది మా హక్కు" అని వారు స్పష్టం చేశారు. రిలే నిరాహార దీక్ష చేస్తున్న హిమాయత్‌నగర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదా హాని జరిగినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించి, పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను వారికి అప్పగించి న్యాయం చేయాలని ఆందోళనకారులు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీద శ్రీను, శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విటల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ అధ్యక్షుడు కరీమ్, సేవాలాల్ యూత్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, శాబాద్ ప్రవీణ్, రెడ్డిపల్లి సుమన్, శాబాద్ నాగరాజు బైండ్ల యాదయ్య, అంగోత్ చెందు, కట్టమిది రత్నయ్య, వీరస్వామి, ఖాసీం, హిమాయత్ నగర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దళిత, ఆదివాసీ హక్కుల

## పరిరక్షణకు ప్రజాప్రతినిధుల బాధ్యత కీలకం

ఢిల్లీలో దళిత--ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



అశ్వరావుపేట ఆర్సి/ సెప్టెంబర్ 29( దళిత, ఆదివాసీ వర్గాల ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం తదితర అంశాలపై న్యూఢిల్లీలో నిర్వహించిన దళిత--ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్




ఆఫ్ ఇండియా మావలంకర్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో, సంబంధిత ఏఐసీసీ విభాగాల సహకారంతో నిర్వహించిన ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా దళిత, ఆదివాసీ వర్గాలు ఎదుర్కొంటున్న వివక్ష, సామాజిక అసమానతలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాల అమలు, భవిష్యత్తులో వివక్షకు సంబంధించినఘటనలను నివారించేందుకు తీసుకోవాల్సినచర్యలపైనా చర్చ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దళిత, ఆదివాసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి సంబంధించిన చర్చల్లో పాల్గొన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ వంటి హక్కుల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు బాధ్యతతో పనిచేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొనడం ద్వారా రాష్ట్రంలోని దళిత, గిరిజన వర్గాలకు సంబంధించిన సమస్యలను విస్తృత స్థాయిలో ప్రస్తావించే అవకాశం కలిగిందని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

## కేశవపట్నంలో పెట్రోల్.. డీజిల్ 'నో స్టాక్'!

ఐదు రోజులుగా కొరత.. మూడు కిలోమీటర్లు వెళ్లి ఇంధనం నింపుకుంటున్న వాహనదారులు




కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 29 : శంకరపట్నం మండలం కేశవపట్నంలో పెట్రోల్, డీజిల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్--వరంగల్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌లో గత ఐదు రోజులుగా పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న ఈ బంక్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో వాహనదారులు వస్తుంటారు. అయితే ఇంధనం అందుబాటులో లేకపోవడంతో అత్యవసరంగా పెట్రోల్, డీజిల్ అవసరమైన వారు వాహనాలను తోసుకుంటూ సమీపంలోని మరో బంక్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేశవపట్నం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి ఇంధనం నింపుకోవాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంధన కొరతను వెంటనే పరిష్కరించి సరఫరాను పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఎస్సీ, బీసీ విద్యార్థుల

## ఉపకార వేతనాల దరఖాస్తులు ఆన్‌లైన్ లో పూర్తి చేయాలి.




నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 9 ) 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, బీసీ విద్యార్థు లకు అందించే ఉపకార వేతనాల కోసం 5వ తరగతి నుంచి 10 వ,తరగతి వరకు చదువుతున్న అ ర్హులైన విద్యార్థుల దరఖాస్తులను ఆన్‌లైన్ లో



పూర్తి చేయించాలని జిల్లా విద్యా శాఖ అధికారి గోవిం ద రాజులు ప్రధానోపాధ్యాయుల ను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని సమా వేశ మందిరంలో ఏర్పాటు చేసిన హె చ్ ఎం ల సమావేశంలో డీ ఈ ఓ మాట్లాడుతూ...విద్యార్థుల ఉప కార వేతనాల దరఖాస్తు ప్రక్రియ లో భాగంగా బయోమెట్రిక్ ఆథెం టికేషన్, ఆధార్ సీడింగ్ తప్పని సరిగా పూర్తి చేయాలని సూచిం చారు. అన్ని వివరాలను సక్రమం గా నమోదు చేసి, బయోమెట్రిక్ ఆథెంటికేషన్,ఆధార్ సీడింగ్ పూ ర్తయిన దరఖాస్తులను సంబంధి త జిల్లా కార్యాలయాలకు పంపిం చాలని ప్రధా నోపాధ్యాయులకు ఆయన సూచించారు. అర్హులైన ఏ విద్యార్థి ఉపకార వేతనాని కి దూరం కాకుండా ప్రధానోపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని,ద రఖాస్తుల ప్రక్రియను నిర్ణీత సమ యంలో పూర్తి చేయించాలని ఆ యన తెలిపారు. ఈ సమావేశం లో బీ సీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, హెచ్ ఎం లు పా ల్గొన్నారు.

## కొలిమికుంటలో భూ రీ సర్వేపై గ్రామసభ నిర్వహణ



చొప్పదండి మండలం, సెప్టెంబర్ 29 :చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామంలో భూభారతి కార్యక్రమంలో భాగంగా భూ పునఃసర్వేకు సంబంధించి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చొక్కల్ల తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూ పునఃసర్వే ప్రక్రియ, భూముల వివరాలు, రైతులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ గ్రామసభకు ఏడీ కిషన్ రావు, డీఐపీ రమణయ్య, తహసీల్దార్ నవీన్ కుమార్, వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి రమ్యజ్యోష్న హాజరయ్యారు. అలాగే సాకార సంఘం చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ప్యాక్స్డైరెక్టర్ చొక్కల్ల కనుకయ్య, ఉపసర్పంచ్ పంజాల లక్ష్మణ్, వార్డు సభ్యులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామ పంచాయతీ అధికారులు, మండల సర్వేయర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు భూ పునఃసర్వేకు సంబంధించిన వివరాలను గ్రామస్థులకు వివరించారు. గ్రామంలోని భూముల వివరాల పరిశీలన, సర్వే నిర్వహణ విధానం, భూ రికార్డుల నమోదు, సర్వే ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భూములకు సంబంధించిన సందేహాలు, సమస్యలను గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిపై చర్చించారు. భూ పునఃసర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా వ్యత్యాసాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సమావేశంలో వివరించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూముల వివరాల నిర్ధారణ, రైతులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో భూ పునఃసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించడం, భూములకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడం ఈ గ్రామసభ ప్రధాన ఉద్దేశంగా నిర్వహించారు.

## కులం, మతం, ప్రాంతం పేరుతో

## ప్రజలను విభజించే రాజకీయాలు మానుకోవాలి

చొప్పదండి మండలం, సెప్టెంబర్ 29 (ఆర్టీఐ ఎక్స్‌ప్రెస్ న్యూస్):బిజెపి చొప్పదండి మండల మరియు పట్టణ శాఖ ఆధ్వర్యంలో చొప్పదండిలోని తెలంగాణ చౌరస్తా వద్ద హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రామేశ్వరం నుంచి కేదార్నాథ్ వరకు, కాశీ నుంచి భద్రాద్రి వరకు భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసాల్లో శివుడు, శ్రీరాముడు విడదీయరాని దైవ స్వరూపమని అన్నారు. శివుడు పేదల దేవుడు, శ్రీరాముడు ధనికుల దేవుడు అన్నట్టుగా మాట్లాడటం ద్వారా సమాజంలో విభజనకు దారితీసేలా ప్రయత్నాలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఓట్ల కోసం దేవుళ్లను, భక్తులను, ప్రాంతాలను విభజించే రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తూ, దేశంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పాలనలో కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలు కొనసాగాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. ముఖ్యంగా దక్షిణాది–ఉత్తరాది, ద్రావిడ–ఆర్య వంటి విభజన చర్చలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించారని వారు విమర్శించారు. హిందువుల విశ్వాసాలను విభజించడానికి ప్రయత్నించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం ప్రజలు గమనిస్తున్నారు. రాముడు, శివుడు ఎవరికో ఒక వర్గానికి చెందిన దేవుళ్లు కాదు అని భారతీయుల ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలు. తెలంగాణలో భద్రాద్రి శ్రీరాముడు, శ్రీశైలం మల్లన్న, వేములవాడ రాజన్న వంటి క్షేత్రాలు ప్రజలందరి విశ్వాసాలకు ప్రతీక అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు మొగిలి మహేష్, పట్టణ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండేటి శివశంకర్, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము రమేష్, జిట్ట కుమార్, కార్యదర్శి సాయికృష్ణ, ఉప సర్పంచ్ సముద్రాల సాయి కిరణ్, సీనియర్ నాయకులు భూమి రెడ్డి, సారయ్య, కిట్టు గౌడ్, తోట కోటేష్, మంచికట్ల మల్లేష్, జక్కుల శంకర్, జక్కుల అంజయ్య, జొంగోని తిరుపతి గౌడ్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షులు పెంచికల రమాదేవి, అమరగొండ తిరుపతి, సంకరి రాజేష్, నెల్లి అనిల్, మడ్డి పరుశురాములు, జాగిరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబా భవాని ఆలయంలో

## దేవీ భాగవత పారాయణం ప్రారంభం



గద్వాల, శివసూర్య సెప్టెంబర్ 29:జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని అంబా భవాని దేవాలయంలో భవాని మాలధారుల ఆధ్వర్యంలో దేవీ భాగవత పురాణ పారాయణం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ధూప దీప నైవేద్య అర్చక జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవీ భాగవత పారాయణాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు దేవి వైభవాన్ని, అమ్మవారి మహిమను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధి భరత్ రెడ్డి, చిన్న ఆంజనేయులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భవాని మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ ఆచార్య చక్రవర్తి చార్యులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి, అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రపంచ హృదయ దినోత్సవం

## సందర్భంగా గుంటి రంగనాథుడికి ప్రత్యేక పూజలు



అలంపూర్,శివసూర్య సెప్టెంబర్ 29:ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజా మున్సిపాలిటీ 6వ వార్డు తుపత్రాల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ గుంటి రంగనాథ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అశ్విని నక్షత్ర యుక్త పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి మంగళ స్నానాలు నిర్వహించి, రంగనాథ అష్టోత్తర శతనామావళితో విశేష పూజలు, మంగళాశాసనాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## యువత భవితకు భరోసా
## కార్యక్రమాల్లో పాల్గొన్న కర్రోతు బంగార్రాజు
## యువతకు విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలే లక్ష్యం



నెల్లిమర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 29()పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని డిగ్రీ కళాశాలల్లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమాల్లో విజయనగరం పార్లమెంట్



సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు.పూసపాటిరేగ గ్రామంలోని శ్రీ.ఎస్.వి.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాల, భోగాపురం గ్రామంలోని శ్రీ లెండి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ యువతకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని తమ ప్రతిభను నిరూపించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్స హించేందుకు ఎన్నారై ఫోరం కృషి.

నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 9 పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆ ధ్వర్యంలో 5 వ, తరగతి



నుంచి 10 వ,తరగతి విద్యార్థులకు మం డల స్థాయిలో టాలెంట్ టెస్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కా ర్యక్రమంలో మండల విద్యాధికా రి మీర్జా కలీముల్లా, మాట్లాడు తూ..... ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించేందుకు ఎన్నారై ఫో రం కృషి చేస్తున్నందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తు లో ఇంకా నిర్వహించాలని సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కా ర్యక్రమంలో జెడ్పి సీఈఓ, ఎంపీ డీవో ప్రధానోపాధ్యాయులు ఉ పాధ్యాయులు, సి ఆర్ పి లు, కో ఆర్డినేటర్ మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొ న్నారు.

## సింగారం గ్రామంలో వరి పొలాల సందర్శన.



నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 9 నారాయణపేట మండలం, సిం గారం గ్రామంలోని వరి పొలాల ను టి ఆర్ వి కే నారాయణపేట సమన్వయకర్త డా. ఈటెల సత్య నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా వరి పంటను పరిశీ లించి ఆకుమచ్చ తెగులు లీఫ్ స్పాట్ ను గుర్తించారు. పంట త్వరగా కోలుకునేందుకు తగిన సస్యరక్షణ యాజమాన్య పద్ధ తులను రైతులకు సూచించారు.అలాగే వరి పంటలో యూరియా వినియోగం, సరైన మోతాదు స కాలంలో యూరియా దరఖాస్తు చేయడం వల్ల కలిగే ప్రయోజనా లను రైతులకు వివరించారు. పం ట ఎదుగుదల దశను బట్టి పోష కాలను సమయాను కూలంగా అందించాలని సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో ఏఈఓ అనిల్ కుమార్ మరియు పలువురు రై తులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2 న, జూనియర్ బాలిక ల కబడ్డీ ఎంపికలు.




నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 9 (నారాయణపేట జిల్లా కబడ్డీఅసోసియేషన్ ఆధ్వర్యంలో తేదీ 2 - 10 - 2026 రోజు ఉదయం 9 గం టలకు మినీ స్టేడియం గ్రౌండ్ నా రాయణపేటలో జూనియర్ బాలి కల కబడ్డీ జట్టుకు ఎంపికలు ని ర్వహించబడునని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోటూర్ నాగేశ్వరె డ్డి, చెన్నారం వెంకటప్ప తెలిపా రు. నారాయణపేట జిల్లా జట్టు కు ఎంపిక కాబడిన జూనియర్ బాలికలకు తేదీ 10- 10 -2026 నుంచి 12 -10 -2026 వరకు మి నీ స్టేడియం అశ్వరావుపేట భద్రా ద్రి, కొత్తగూడెం జిల్లా యందు ని ర్వహించబడును జూనియర్ బా లికలకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పో టీలలో నారాయణపేట జిల్లా త రఫున పాల్గొంటారు. కావున ఇట్టి నారాయణపేట జిల్లా బాలికలు కబడ్డీ జట్టు ఎంపిక పోటీల లో పాల్గొనాల్సిందిగా కోరనైనది. అ ర్హత బాలికల బరువు 65 కేజీల లోపు కలిగి వయస్సు 30 -11- 2006 తర్వాత పుట్టిన వారు అ ర్హులని క్రీడాకారులు సూజ మెమో ఆధార్ కార్డు తీసుకురావాలన్నా రు. వివరాలకు క్రింది నంబర్లను సంప్రదించగలరు 949148 97 54.

# ప్రాథమిక విద్యను బలోపేతం చే స్తూ.. నైపుణ్య విద్యకు బాటలు

-ప్లాన్ ఎక్సెల్, కౌశల్ బోధపై ఉపా ధ్యాయులకు శిక్షణ.....

-గుండుమాల్‌లో జిల్లా స్థాయి శిక్ష ణ కార్యక్రమం.



నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 9 )గుండు మాల్ విద్యార్థుల్లో ప్రాథ మిక అభ్యసన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ నైపుణ్యాలు, వృత్తి విద్యకు పునాది వేయడ మే లక్ష్యంగా ప్లాన్ ఆక్షన్, కౌశల్ బోధ కార్యక్రమాల పై ఉపాధ్యా యులకు జిల్లా స్థాయి శిక్షణ కా ర్యక్రమాన్ని మంగళవారం గుం డుమాల్‌లోని తెలంగాణ మోడ ల్ స్కూల్ టీజీ ఎంఎస్ లో నిర్వ హించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎం.గోవిం దరాజు మాట్లాడుతూ.. విద్యార్థు ల అభ్యసన స్థాయులను నిరంత రం పర్యవేక్షిస్తూ, ప్రతి విద్యార్థి త న వయసు,తరగతికి అనుగుణం గా కనీస అభ్యసన సామర్థ్యాల ను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలనిసూచించా రు. ప్రాథమిక దశలో చదవడం, రాయడం,అర్థంచేసుకోవడం, సం ఖ్యా పరిజ్ఞానం వంటి నైపుణ్యా లు బలంగా ఉంటేనే విద్యార్థి త దుపరి విద్యా దశ ల్లో మెరుగైన ఫలితాలు సాధించగలడని పేర్కొ న్నారు.నెమ్మదిగా అభ్యసించే వి ద్యార్థులకు యాక్షల్ వారధి ఏ ఎం ఓ విద్యాసాగర్ మాట్లాడు తూ..ప్లాన్ ను బలోపేతం చేయ డంలో ఎక్సెల్ అడెక్టివ్, ఆల్ - ఎ నబేళ్లుడు లర్నింగ్ వంటి సాంకే తిక ఆధారిత అభ్యసన విధానా లను సమర్థవంతంగా వినియో గించాల్సిన అవసరం ఉందన్నా రు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యస న స్థాయులను గుర్తించి, వారి అ వసరాలకు అనుగుణంగా అభ్య సన అవకాశాలను కల్పించడమే యాక్షల్ ప్రధాన ఉద్దేశమని తెలి పారు. ముఖ్యంగా నెమ్మదిగా అ భ్యసించే విద్యార్థులకు స్లో లెర్న ర్స్ అవసరమైన అదనపు అభ్య సన సహాయాన్ని అందించడంలో యాక్షల్ ఒక వారధిగా పనిచేయా లని, సాంకేతికతను ఉపయోగిం చు కొని విద్యార్థులను క్రమంగా మెరుగైన అభ్యసన స్థాయికి తీ సుకురావాలని సూచించారు. ఉ పాధ్యాయులు కేవలం సాంకేతిక సాధనాలను ఉపయోగించడం మాత్రమే కాకుండా, విద్యార్థుల పురోగతిని విశ్లేషించి, అవసర మైన చోట వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని అన్నారు. కౌశల్ బోధ తో నైపుణ్య విద్యకు తొలి అడుగు 6, 7, 8 తరగతుల వి ద్యార్థుల్లో చేసి నేర్చుకునే విధా నం లెర్నింగ్ బై డయింగ్ సృజ నాత్మకత,సమస్య పరిష్కార సా మర్థ్యం, కమ్యూనికేషన్, సహకా రం, పరిశీలన, ప్రణాళిక ప్రాథమి క వృత్తి నైపుణ్యాలను పెంపొం దించడమే కౌశల్ బోధ కార్యక్ర మం లక్ష్యమని అధికారులు తె లిపారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు వివిధ రకాల పను లు, స్థానిక వనరులు, వృత్తులు, పని ప్రపంచం, నైపుణ్యాలపై అ వగాహన కల్పించడం ద్వారా వా రి ఆసక్తులను గుర్తించేందుకు అ వకాశం కలుగుతుందని పేర్కొ న్నారు. కౌశల్ బోధ విద్యార్థి జీవి తంలో భవిష్యత్ వృత్తి విద్యకు ఒక స్టెపింగు స్టోన్ గా నిలవాలని, పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను వి ద్యార్థులకు అందించాల్సిన అవ సరం ఉందన్నారు.గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు, వొకేషనల్ ట్రైనర్స్ సమన్వయం తో విద్యార్థులకు స్థానిక పరిస్థితు లు, వనరులు, వారి ఆసక్తులకు అనుగుణంగా ప్రాజెక్టులు, కార్య కలాపాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు.శిక్షణకు ఉపాధ్యాయుల భారీ భాగస్వా మ్యం ప్లాన్ -ఆక్సిల్ శిక్షణలో కో స్గి, గుండుమాల్, మద్దూర్, కొత్త పల్లి మండలాల్లోని అన్ని యాక్ష ల్ పాఠశాలల నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయుడు పాల్గొనడంతో పాటు, మిగిలిన యాక్షల్ పాఠ శాలల నుంచి 115 మంది ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. కౌశల్ బోధ శిక్షణ లో 28 పాఠశాలల నుంచి 130 మంది ఉపాధ్యా యు లు, వొకేషనల్ ట్రైనర్స్ పా ల్గొన్నారు. 6వ, 7వ, 8వ తరగ తులకు బోధించే గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులతో పాటు వొకేషనల్ ట్రైనర్స్‌కు కా ర్యక్రమం అమలు, ప్రాజెక్ట్ ఆధా రిత అభ్యసనం, విద్యార్థుల్లో నై పుణ్యాల అభివృద్ధికి సంబంధి చిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

### -రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యం లో శిక్షణ...

కౌశల్ బోధ శిక్షణ కు జహంగీర్, సూర్యప్రకాష్, తిరుపతి నాయక్, నిసార్, జ్ఞానేశ్వర్, వెంకటేష్ రిసో ర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.ప్లాన్- ఎక్సల్ శిక్షణకు నరేష్ కం సంపల్లి, హరిసుధన్, విష్ణువర్ధన్, నరేష్ హన్మంపల్లి, శంకర్, అఖిల్ యాదవ్, అనంతయ్య రిసోర్స్ ప ర్సన్లుగా పాల్గొని ఉపాధ్యాయుల కు శిక్షణ అందించారు.శిక్షణ ద్వా రా పొందిన అవగాహనను ఉపా ధ్యాయులు పాఠశాల స్థాయి లో ఆచరణలోకి తీసుకువచ్చి, ఒకవై పు ప్రతి విద్యార్థి ప్రాథమిక అభ్య సన సామర్థ్యాలను సాధించేలా ప్లాన్ - యాక్షల్ ను బలోపేతం చే యడంతో పాటు, మరో వైపు వి ద్యార్థుల్లో భవిష్యత్ నై పుణ్యా లు, వృత్తి విద్య పట్ల ఆసక్తిని పెం పొందించేలా కౌశల్ బోధ నుసమ ర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.

## గుండెపోటుతో బీఆర్ఎస్ సీనియర్ నేత మృతి



కరీంనగర్ జిల్లా, సెప్టెంబర్ 29 :శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత కనకం నాగయ్య మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.తెలంగాణ ఉద్యమ సమయంలో నాగయ్య చురుకుగా పాల్గొని ప్రత్యేక తెలంగాణ కోసం తనవంతు కృషి చేశారు. దీంతో ఆయనకు మండలంలో 'టీఆర్ఎస్ నాగయ్య'గా ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది.ఆయన మృతితో ముత్తారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.మృతుడికి భార్య వసంతతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

## బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం సహకారంతో సరస్వతి మాత విగ్రహా కట్ట ఏర్పాటుకు జిల్లా గవర్నర్ చే భూమి పూజ

పాఠశాల మొత్తం విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు

,పెన్నులు, పెన్సిళ్లు,రబ్బరులు షాప్నర్లు స్కేలు పంపిణీ



మక్తల్ సెప్టెంబర్ 29 మక్తల్ పట్టణ కేంద్రంలో మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బ్రిలియంట్ స్కూల్ నందు వాసవి క్లబ్ జిల్లా వి 108 గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా.. మొదటగా సరస్వతి మాత ఫోటోకు ముఖ్య అతిథి గవర్నర్ చే, అతిథులు రీజన్ చైర్మన్, సెక్రెటరీ, జెడ్ సి , వాసవి క్లబ్ సభ్యులచే పూజ చేసిన, అనంతరం జిల్లా గవర్నర్ గోల్డెన్ స్టార్ కేసీజీఎఫ్ కల్మచర్ల రమేష్ సార్ చేతుల మీదుగా బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం వారి సహకారంతో సరస్వతి విగ్రహానికి కట్ట చేయుట కోసం భూమి పూజ చేయడం జరిగింది. అలాగే ముఖ్య అతిథి జిల్లా వి 108 ఏ గవర్నర్ గోల్డెన్ స్టార్ కె సి జి ఎఫ్ కల్మచర్ల రమేష్, అతిథులు రీజియన్ చైర్మన్ ప్రతిభా సంకల్పం కే సి జి ఎఫ్ శ్రీకర్ నాగ సావిత్రి, రీజన్ సెక్రెటరీ నీలకాంత్, జెడ్ సి బెండె సత్యవతి, ప్రిన్సిపల్ సుజిత రెడ్డిగారిచే విద్యార్థిని విద్యార్థులకు నోట్బుక్కులు, పెన్నులు పెన్సిళ్లు రబ్బరులు మాగనూరు ఆర్యవైశ్య సంఘం సభ్యులచే, అలాగే ముఖ్యఅతిథి, అతిథులు,మక్తల్ మాజీ డిప్యూటీ గవర్నర్లు, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి,కోశాధికారి సభ్యులచే విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ గవర్నర్ కల్వ శ్రీనివాస్,కాబినెట్ నాగరాజు,మాజీ కె సి జి ఎఫ్ అధ్యక్షులు బిలకంటి నర్సయ్య, బిలకంటి జగదీశ్, ప్రిన్సిపల్ సుజిత రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, పిఈటి బాలరాజ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, కార్యదర్శి కొత్త ఆంజనేయులు, తాళంపల్లి పవన్ కుమార్,పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు గట్టమ్మను దర్శించుకున్న హీరో నాని

ములుగు, సెప్టెంబర్ 29: సినీ హీరో నాని తన 'ప్యారడైస్' మూవీ బృందంతో కలిసి మంగళవారం



ములుగు జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ములుగు గట్టమ్మ ఆలయం వద్ద అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గట్టమ్మ అమ్మవారిని హీరో నాని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.నాని గట్టమ్మ ఆలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. తమ అభిమాన హీరోను చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. ఆలయం వద్ద నాని కనిపించడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. పలువురు అభిమానులు నానితో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. నాని కూడా అభిమానులను అభివాదం చేస్తూ పలకరించారు. దీంతో గట్టమ్మ ఆలయ పరిసరాల్లో కొద్దిసేపు సందడి వాతావరణం నెలకొంది. 'ప్యారడైస్' మూవీ బృందం ములుగు జిల్లాకు రావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష...

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి ... జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల జిల్లా, సెప్టెంబర్ 29, :గోదావరి పుష్కరాలు--2027 నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ధర్మపురి, కోటిలింగాల, వెల్గటూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, బీర్పూర్, రాయికల్ మండలాల పరిధిలోని గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పుష్కరాల సందర్భంగా జిల్లాలో సుమారు 2.40 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.పుష్కరాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖలకు కలిపి రూ.220.41 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. ఇరిగేషన్, ఎండోమెంట్స్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా--పారిశుధ్యం, పర్యాటకం తదితర శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణకు రూ.10 కోట్లు, కోటిలింగాల ఆలయ పునరుద్ధరణకు రూ.10 కోట్లు మంజూరై పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. కోటిలింగాల ఆలయ పునరుద్ధరణలో భాగంగా పాత ఆలయ కూల్చివేత పనులు పూర్తయ్యాయని వివరించారు.ధర్మపురి, కోటిలింగాల ఘాట్ల విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ధర్మపురి ఘాట్లకు, కోటిలింగాల ఘాట్‌కు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.పుష్కరాలకు వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల అభివృద్ధి, విస్తరణ, ఘాట్లకు అనుసంధాన రహదారుల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో పలు రహదారి పనులకు టెండర్లు ఖరారైనట్లు అధికారులు తెలిపారు.భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ధర్మపురి మున్సిపాలిటీకి రూ.2 కోట్లు, కోటిలింగాలకు రూ.48 లక్షలతో శాశ్వత నీటి సరఫరా, పారిశుధ్య సదుపాయాల పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.పుష్కరాల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన విద్యుత్ మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయాల పరిసరాల్లో తాత్కాలిక, శాశ్వత విద్యుత్ ఏర్పాట్లను చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఘాట్ల వద్ద పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర సేవలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వైద్య శిబిరాలు, పారిశుధ్య సిబ్బంది, తాగునీరు, విద్యుత్, రహదారులు, పార్కింగ్ తదితర అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో కిషన్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు,తహసీల్దార్ లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 7న సమాచార హక్కు చట్ట సాధన కమిటీ ఆవిర్భావ సభ

పెద్దపల్లి కలెక్టరేట్‌లో గోడపత్రిక ఆవిష్కరణ..



పెద్దపల్లి, 29 సెప్టెంబర్ : సమాచార హక్కు చట్ట సాధన కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 7న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆవిర్భావ సభకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కల్పన తదితరులు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట సాధన కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పాంద్రాల రాజు, జిల్లా ఇంచార్జి తోగరి సురేష్, ఉపాధ్యక్షుడు యాసం శ్రావణ్, కన్వీనర్ శ్రావణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేగోలపు సురేష్, రామగుండం ఉపాధ్యక్షుడు పెద్దపల్లి రామచంద్రం, జాయింట్ సెక్రటరీ రామగిరి శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ బూడిద అనిల్, సోషల్ మీడియా ఇంచార్జి ఆకుల రాఘవ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు లభించిన హక్కులపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని చట్టబద్ధమైన విధానంలో పొందేందుకు సమాచార హక్కు చట్టం ఒక ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకుని వాటిని సక్రమంగా వినియోగించుకునేలా గ్రామస్థాయి నుంచి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ కృషి చేస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కమిటీ లక్ష్యమని తెలిపారు.ఆవిర్భావ సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలిఅక్టోబర్ 7న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆవిర్భావ సభకు పెద్దపల్లి జిల్లా నుంచి కమిటీ సభ్యులు, కార్యకర్తలు, సమాచార హక్కు చట్టంపై ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యుల ఐక్యత, సమిష్టి కృషి, సహకారంతో అక్టోబర్ 7న నిర్వహించనున్న ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పిస్తూ, చట్టబద్ధమైన హక్కులను ప్రజలు సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని సభ్యులు తెలిపారు.

# ప్రేమికుల దినోత్సవం స్పెషల్.. ప్రేమ యాత్రలకు ఇవే బెస్ట్ డెస్టినేషన్స్..!



ప్రేమికుల దినోత్సవం అంటేనే ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని వేడుక చేసుకోవడం. ఈ ఏడాది వాలెంటైన్స్ డే శనివారం రావడంతో.. సెలవుల గురించి ఆలోచించకుండా ఒక చిన్నపాటి విహారయాత్రను ప్లాన్ చేసుకోవచ్చు. కొందరు ముందే రిజర్వేషన్లు చేసుకుని సిద్ధంగా ఉంటే.. మరికొందరు ఆఫీసు పనుల ఒత్తిడిలోపడి ప్లానింగ్ను ఆఖరి నిమిషం వరకూ వాయిదా వేస్తుంటారు. మీరుకూడా ఆ లాస్ట్ మినిట్ లిస్టో ఉన్నారా? అయినా కంగారేం లేదు! సాధారణంగా వాలెంటైన్స్ డే సందర్భంగా పాపులర్ టూరిస్ట్ ప్రాంతాలన్నీ రద్దీగా ఉంటాయి. కాబట్టి తర్వాతి వీకెండ్ వరకైనా ప్లాన్ చేయండి. రొటీను భిన్నంగా కాస్త ప్రశాంత తను, కొత్తదనాన్ని ఇచ్చే ఈ ప్రదేశాల్లో బిలేటెడ్ ప్రేమికుల దినోత్సవం జరుపుకోండి.



## కలర్‌ఫుల్ కేరళ :

ప్రకృతి ఒడిలో సేదతీరాలని అను కునే జంటలకు వాయనాడ్ ఒక స్వర్గధామం. దట్ట మైన అడవులు, ఎత్తయిన కొండలు, రకరకాల వన్య ప్రాణులతో ఈ ప్రాంతం పర్యాటకులను మంత్రము గ్ధులను చేస్తుంది. ముఖ్యంగా ఇక్కడి నియోలిథిక్ కాలం నాటి పురాతన గుహలు, అందమైన రిసార్టులు మీ వీకెండ్ను మరింత కలర్ ఫుల్గా మారుస్తాయి. ప్రకృతి ప్రేమికులకు వాయనాడ్ ఫస్ట్ ఛాయిస్ అవుతుంది.



## సుగంధాల గుబాలింపు:

మీకు కొండలు, పచ్చని ప్రకృతి అంటే ఇష్టమా? అయితే కూర్గ్ ను మించిన మరో ఆప్షన్ లేదు. పశ్చిమ కనుమల్లోని ఈ అందం మైన ప్రాంతంలో ఎటుచూసినా కాఫీ తోటలు, సుగంధ ద్రవ్యాల గుబాళింపులు మీకు స్వాగతం పలుకుతాయి. ఇక్కడి హోమ్ స్టేలు, లగ్జరీ రిసార్టులు మీ ట్రిప్ను మరింత రొమాంటిక్‌గా మారుస్తాయి. స్థానిక వంటకాలను రుచి చూస్తూ జలపాతాలు హోరులో మీ భాగస్వామితో గడిపే సమయం మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

## కొత్త లోకం:



మీకు వైట్ వాలెంటైన్స్ డే జరుపుకోవా లని ఉందా? చుట్టూ మంచు కురుస్తుంటే, ఆ మంచులో మీ ప్రియమైన వారితో గడపాలని అను కుంటున్నారా? అయితే వెంటనే అరుణాచల్ ప్రదేశ్ లోని తవాంగ్కు టికెట్స్ బుక్ చేసుకోండి. మంచుతో కూడిన పర్వత శిఖరాలు, నిశ్శబ్దంగా ఉండే లోయలు ప్రేమికులకు ఒక అద్భుతమైన అనుభూ తిని ఇస్తాయి. ఇక్కడి పురాతన బౌద్ధ మఠాలు చూస్తుంటే వేరే ప్రపంచంలో ఉన్నామనే భావన కలుగుతుంది.

# పర్యావరణానికి ఎంతో మేలు చేసే ప్లానెటరీ హెల్త్ డైట్.. అసలేంటిది.. దీన్ని ఎలా పాటించాలి..?



తఈట్-లాన్సెట్ డైట్ లేదా ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి సహజ వనరులను రక్షించేందుకు రూపొందించిన శాస్త్రీయ ఆహార విధానం. 2019లో 16 దేశాలకు చెందిన 37 మంది నిపుణులు కలిసి ఈ డైట్‌ను రూపొందించారు. 2050 నాటికి 10 బిలియన్ జనాభాకు ఆహారం అందించడంలో పర్యావరణానికి నష్టం కలగకుండా ఉండటం దీని ప్రధాన లక్ష్యం. ఈ డైట్ కఠినమైన నియమాలపై ఆధారపడినది కాదు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకునే విధంగా ఉంటుంది. ఇందులో కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గింజలు ప్రధాన భాగంగా ఉంటాయి. అలాగే పాలు, గుడ్లు, మాంసం వంటి వాటిని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలని ఈ డైట్ సూచిస్తుంది. సాధారణంగా పురుషులకు రోజుకు సుమారు 2,500 కేలరీలు, మహిళలకు 2,000 కేలరీలు సూచిస్తారు. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన రిఫరెన్స్ డైట్‌గా పరిగణించబడుతుంది. ఇది భిన్న ప్రాంతాలు, సంస్కృతులకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఇస్తుంది. ముఖ్యంగా మొక్కల ఆధారిత ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, జంతు ఆధారిత ఆహారాన్ని తగ్గించాలని సూచిస్తుంది.డైట్ ప్లాన్

## ఏయే ఆహారం ఎంత తీసుకోవాలి..

ఈ డైట్‌లో ఆహారం ఎంత మోతాదులో తీసుకోవాలో కూడా సూచించబడుతుంది. రోజుకు కనీసం 300 గ్రాముల కూరగాయలు, 200 గ్రాముల పండ్లు తీసుకోవాలి. సంపూర్ణ ధాన్యాలు సుమారు 232 గ్రాములు తీసుకోవడం ద్వారా శరీరానికి స్థిరమైన శక్తి లభిస్తుంది. అలాగే పప్పులు 75 గ్రాములు, గింజలు 50 గ్రాములు, ఆరోగ్యకరమైన నూనెలు 40 గ్రాములు తీసుకోవాలి. పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వంటి ప్రోటీన్ ఆహారాలను మాత్రం పరిమితంగా తీసుకోవాలి. రోజుకు 250 గ్రాముల పాలు, గుడ్లు ఒకరోజు విడిచి ఒకటి, చేపలు లేదా చికెన్ 29 గ్రాములు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎర్ర మాంసం (రెడ్ మీట్) కేవలం 14 గ్రాములకే పరిమితం చేయాలి. అదనపు చక్కెర 31 గ్రాములకు మించకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమి, నీటి వనరులను భారీగా వినియోగిస్తూ, గ్రీన్ హౌస్ వాయువులను అధికంగా విడుదల చేస్తున్నారు. ఈ డైట్‌ను అనుసరించడం ద్వారా పర్యావరణంపై పడే ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎర్ర మాంసం వినియోగం 80-90% వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది.

## అనేక లాభాలు..

ప్లానెటరీ హెల్త్ డైట్ అనుసరించడం వల్ల ఆరోగ్యపరమైన అనేక లాభాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. హార్వర్డ్ పరిశోధన ప్రకారం, ఈ డైట్‌ను క్రమంగా పాటించడం వల్ల ముందస్తు మరణ ప్రమాదం సుమారు 30% వరకు తగ్గుతుంది. గుండె వ్యాధులు, క్యాన్సర్, స్ట్రోక్, డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 11 మిలియన్ మరణాలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ డైట్ గుండె, మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలోనూ సహాయపడుతుంది. మొక్కల ఆధారిత ఆహారాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. అలాగే మెదడు పనితీరును కాపాడి మతిమరుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఈ డైట్ ఉపయోగకరంగా ఉంటుంది. ఫైటోకెమికల్స్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి రక్షణ లభిస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడ్ మీట్ తగ్గించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది.రెస్టారెంట్ సమీక్షలు

## పర్యావరణ పరిరక్షణ కూడా..

పర్యావరణ పరిరక్షణలో కూడా ఈ డైట్ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను 29% వరకు తగ్గించడమే కాకుండా, ఎరువుల వినియోగాన్ని 21% వరకు తగ్గిస్తుంది. వ్యవసాయ భూమి అవసరాన్ని కూడా 51% వరకు తగ్గించే సామర్థ్యం ఉంది. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి సమతుల్యమైన పరిష్కారం. సరైన ఆహార ఎంపికల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమిని కూడా రక్షించవచ్చు. అయితే ఈ డైట్‌ను అనుసరించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# వేసవిలో శరీరానికి ఐరన్ లభించాలంటే.. ఈ ఆహారాలను తీసుకోవాలి..

ఇనుము మనిషి శరీరానికి అత్యంత అవసరమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ రక్తం ద్వారా ఆక్సిజన్‌ను శరీరమంతా చేరవేయడానికి సహాయపడుతుంది. శరీరంలో ఇనుము సరిపడినంత ఉండటం వల్ల శక్తి స్థాయిలు, మెదడు పనితీరు మెరుగ్గా ఉంటాయి. ఇనుము లోపం వల్ల అనీమియా అనే సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య భారతీయ మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. దీని వల్ల అలసట, బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే శరీరంలోని పలు ముఖ్యమైన ప్రక్రియలకు కూడా ఇనుము అవసరం. ఇనుము స్థాయిని పెంచుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఆహారాల్లో హీమ్ ఐరన్ (జంతు ఆహారాల్లో), నాన్-హీమ్ ఐరన్ (మొక్కల ఆహారాల్లో) అనే రెండు రకాల ఐరన్ లభిస్తాయి. ఈ రెండింటినీ సమతుల్యంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఇనుము అందుతుంది. వేసవిలో ఐరన్ ను అందించే అనేక భారతీయ ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి.



## దానిమ్మ పండ్లు, బీట్ రూట్..

వేసవిలో ఐరన్ ను పెంచుకోడానికి దానిమ్మ పండు మంచి ఎంపిక. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము, ఫైబర్, పొటాషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సులభతరం చేయడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. పాలకూర కూడా ఇనుముకు మంచి వనరు. ఇది నాన్-హీమ్ ఐరన్ కలిగి ఉండటంతో శరీరానికి ఉపయోగపడుతుంది. దీనిని సలాడ్లు, పప్పు లేదా స్మూతీల రూపంలో తీసుకోవచ్చు. బీట్‌రూట్ రక్త ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో దీన్ని సలాడ్ లేదా రైతా రూపంలో తీసుకోవచ్చు. పప్పులు, శనగలు వంటి ఆహారాలు కూడా మంచి ఐరన్ వనరులు. ఇవి శాకాహారులకు ఉత్తమమైన ఎంపికగా నిలుస్తాయి, రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. పుచ్చకాయలో ఇనుము తక్కువగా ఉన్నప్పటికి, వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇది దాహాన్ని తీర్చడంలో కూడా సహాయపడుతుంది. బెల్లం సహజంగా ఇనుము అందించే ఆహారం. చక్కెరకు బదులుగా కొద్దిగా బెల్లం తీసుకోవడం వల్ల శరీరానికి కొంత ఇనుము లభిస్తుంది. అయితే దీనిని మితంగా మాత్రమే తీసుకోవాలి.

## మునగ ఆకులు, విటమిన్ సి..

మునగలో ప్లాంట్-బేస్డ్ ఐరన్ అధికంగా ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా ఉండటంతో ఐరన్ శోషణను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఇది ప్రత్యేకంగా ఉపయోగకరమైన ఆహారమని చెప్పవచ్చు. ఇవే కాకుండా గింజలు, విత్తనాలు, పూర్తి ధాన్యాలు, చేపలు, డ్రై ఫ్రూట్స్ కూడా ఐరన్ మంచి వనరులుగా పరిగణించబడతాయి. ఈ ఆహారాలను తీసుకోవడంతోపాటు ఐరన్ శోషణను మెరుగుపరచడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. హీమ్, నాన్-హీమ్ ఐరన్ రెండింటినీ కలిపి తీసుకోవడం మంచిది. అలాగే విటమిన్ సి ఉన్న ఆహారాలను ఐరన్ ఉన్న భోజనంతో తీసుకుంటే శరీరం ఐరన్‌ను సులభంగా గ్రహిస్తుంది. అదేవిధంగా టీ, కాఫీ, కాల్షియం వంటి పదార్థాలను ఐరన్ ఉన్న భోజనంతో కలిసి తీసుకోవడం నివారించాలి, ఎందుకంటే ఇవి ఐరన్ శోషణను తగ్గిస్తాయి. వేసవిలో ఈవిధంగా సరైన ఆహారం, మంచి అలవాట్ల ద్వారా శరీరంలో ఇనుము స్థాయిని సులభంగా పెంచుకోవచ్చు. ఇది ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# పేరెంటింగ్

# ఏఐతో... ఆటలొద్దు!

పిల్లలు ఏడుస్తారు, నవ్వుతారు, బుంగమూతి పెట్టి అలుగుతారు... వారికంటూ స్నేహితులు ఉంటారు. వారితో తమదైన భాషలో మాట్లాడుతుంటారు. ఇప్పుడు ఆ పిల్లల ప్రపంచంలోకి ఏఐ టాయ్స్ వచ్చాయి. ఫ్రెండ్‌తో మాట్లాడినట్లే పిల్లలు వాటితో మాట్లాడుతున్నారు. నవ్వుతున్నారు. తమకు ఏమనిపిస్తుందో చెబుతున్నారు...

వినడానికి ఇది బాగానే ఉంది కానీ... ఏ.ఐ. బొమ్మల ప్రభావం పిల్లలపై మంచిది కాదని చెబుతున్నారు పరిశోధకులు. సహజమైన బాల్యాన్ని, భావోద్వేగాలను 'ఏఐ బొమ్మలు' హరించకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు... ఫ్రెండ్‌లాగా సంభాషించడం నుంచి భావోద్వేగాలు గ్రహించడం వరకు ఏఐ బొమ్మలు పిల్లలకు చేరువ అవుతున్నాయి. ఏఐ--ఆధారిత బొమ్మలు వినగలవు. అర్థం చేసుకోగలవు. ఏదైనా అడిగితే సమాధానాలు ఇవ్వగలవు. దీంతో అవి అపురూపంగా అనిపిస్తాయి. అయితే పిల్లలపై ఏఐ బొమ్మల ప్రభావం ఏ రకంగా ఉంటుంది అనే దానిపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ప్రతికూలతల గురించి చెప్పుకోవాలంటే.... పిల్లల భావోద్వేగాలకు సంబంధించి ఏఐ బొమ్మలు అతిగా స్పందిస్తుంటాయి. మితిమీరిన సానుభూతి చూపుతుంటాయి. ఒక నిమిషం విచారంగా, మరు నిమిషం సంతోషంగా ఉండగలిగే పిల్లలకు ఇది అవసరం లేదు అంటున్నారు నిపుణులు.

## సహజత్వం లేకుండా....

'పిల్లలకు ఏఐ బొమ్మలు తోడుగా ఉండే మాట వాస్తవమే అయినా, వివిధ సందర్భాలలో స్పందించడానికి సంబంధించి వాటి ఉద్దేశాలను అర్థం చేసుకోవడం కష్టం' అంటున్నారు నిపుణులు. 'ఏఐ ఆధారిత బొమ్మల కొత్త ట్రెండ్ ఆందోళన కలిగిస్తోంది' అంటుంది లండన్‌లోని డిజైన్ కంపెనీ 'మోరమా' వ్యవస్థాపకురాలు, యూకే డిజైన్ కౌన్సిల్ సభ్యురాలు జో బర్నార్డ్. మానవ సంబంధాలకు భిన్నంగా ఏఐ బొమ్మ ఫ్రెండ్స్ ఎప్పుడూ సహనంగా, స్నేహంగా ఉండేలా డిజైన్ చేశారు. 'ఏఐ బొమ్మలలో సహజ స్పందన లేక?ోవడం వల్ల, వాస్తవ ప్రపంచాన్ని పిల్లలు అర్థం చేసుకోలేరు. మీరు ఒక చాట్‌బాట్‌తో ఎంత దారుణంగా ప్రవర్తించినా, అది మిమ్మల్ని అభిమానిస్తుంది. కాని వాస్తవ ప్రపంచంలో అలా ఉండదు కదా!' అంటుంది జో బర్నార్డ్.

## ఇలా అయితే... చాలా కష్టం

సహజత్వం లోపించిన సంభాషణల వల్ల పిల్లలకు భావోద్వేగపరమైన నష్టాలతో?టు, మేధోవికాసం (కాగ్నెటివ్ ఎఫర్ట్)పై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నిరంతరం పిల్లలతో సంభాషించేలా ఏఐ టాయ్స్‌ను రూ?ందించారు. దీనివల్ల పిల్లలలో ఆధారపడే తత్త్వం పెరిగే ప్రమాదం ఉంది. దాని బారి నుండి వారిని బయటికి తీసుకురావడం చాలా కష్టం అవుతుంది.

## వికటిస్తుందా?

ఒక వస్తువును ఎలా డిజైన్ చేస్తారనే దానిపైనే మనం దానితో ఎలా వ్యవహరిస్తామనేది ఆధారపడి ఉంటుంది. ఈ తరానికి సంబంధించి ఏఐ బొమ్మల కంపెనీలు 'ఆకర్షణీయత'కే పెద్ద పీట వేశాయి. అయితే ఆ ఆకర్షణీయ విధానం పిల్లల అవసరాలకు విరుద్ధంగా ఉంటుంది. ఏఐ బొమ్మల మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, కంపెనీలు మరిన్ని ఫీచర్‌లు, సామర్థ్యాలను జోడించడానికి ?ోటీ పడుతున్నప్పటికీ, అది వికటించే ప్రమాదం ఉందని చెబుతున్నారు నిపుణులు.




## గాబో గందరగోళం!

మూడేళ్ల పిల్లల కోసం ఎన్నో ఏఐ బొమ్మలు మార్కెట్‌లో ఉన్నాయి. అయితే ప్రీ--స్కూల్ పిల్లలపై ఏఐ సాంకేతిక ప్రభావం గురించి చాలా తక్కువ పరిశోధన జరిగింది. తాజా విషయానికి వస్తే...అయిదేళ్ల లోపు పిల్లలపై ఏఐ బొమ్మల ప్రభావం ఎంత ఉంటుంది అనే దానిపై తొలిసారిగా ఒక అధ్యయనం నిర్వహించింది కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ బృందం. ఈ నేపథ్యంలో పిల్లల కోసం రూ?ందించిన ఏఐ--ఆధారిత బొమ్మలకు సంబంధించి కఠినమైన నియంత్రణ అవసరం అని చెబుతున్నారు పరిశోధకులు. తమ అధ్యయనంలో భాగంగా మూడు నుండి అయిదు సంవత్సరాల వయస్సు గల కొద్దిమంది పిల్లలు 'గాబో' అనే ఏఐ బొమ్మతో ఎలా వ్యవహరిస్తారో పరిశీలించారు. 'గాబో' అనేది వాయిస్--యాక్టివేటెడ్ ఏఐ చాట్‌బాట్. ప్రీ--స్కూలు పిల్లలు దానితో మాట్లాడేలా, ఆటలు ఆడే విధంగా రూ?ందించారు. తమ అధ్యయనంలో భాగంగా 'గాబో' భాష, సంభాషణలకు సంబంధించిన నైపుణ్యాలను పరీక్షించారు. పిల్లలు 'గాబో'తో మాట్లాడడానికి తరచుగా ఇబ్బందిపడడాన్ని గమనించారు. పిల్లలు, పెద్దవారి గొంతుల మధ్య తేడాని 'గాబో' గుర్తించలేక?ోయింది. ఒక పిల్లవాడు బొమ్మతో 'నువ్వంటే నాకు ఇష్టం' అని చెప్పినప్పుడు అది అర్థం లేని సమాధానం ఇచ్చింది. పిల్లవాడి మాటకు 'థ్యాంక్యూ' లేదా 'నాకు కూడా నువ్వంటే ఇష్టం'లాంటి మాటలేవో వాడాలి. అలా కాకుండా...'మీరు ఎలా ముందుకు వెళ్లాలనుకుంటున్నారో నాకు తెలియజేయండి' అని స్పందించింది ఆ ఏఐ బొమ్మ. మూడేళ్ల చిన్నారి 'నాకు బాధగా ఉంది' అనే భావం వ్యక్తీకరించే మాట మాట్లాడినప్పుడు... 'నేను సంతోషంగా ఉండే చిన్న రోబోట్‌ని. ఈ సరదాను కొనసాగిద్దాం. మనం తర్వాత దేని గురించి మాట్లాడుకుందాం?' అని ఆ చిన్నారిని అడిగింది బొమ్మ.

## ఈ సమయంలో కరెక్ట్ కాదు

'పిల్లలు సామాజిక విషయాలను తెలుసుకునే అభివృద్ధి దశలో జనరేటివ్ ఏఐ అవుట్‌పుట్ గందరగోళంగా ఉంటోంది' అంటున్నారు పరిశోధకులు. 'గాబో వంటి బొమ్మలు పిల్లల మాటలు, భావాలను తప్పుగా అర్థం చేసుకోవచ్చు' అంటున్నారు అధ్యయన సహ రచయిత డాక్టర్ ఎమిలీ. సంవత్సర కాలం ?టు ఏఐ బొమ్మల పనితీరును, పిల్లలపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసిన తరువాత...'అయిదేళ్ల లోపు పిల్లల కోసం విక్రయించే ఏఐ బొమ్మలు సైకలాజికల్ సేఫ్టీని అందిస్తున్నాయని నిర్ధారించడానికి నియంత్రణ సంస్థలు వెంటనే చర్యలు తీసుకోవాలి' అని కోరుతున్నారు పరిశోధకులు. 'ఏఐ బొమ్మలను తల్లిదండ్రులు పర్యవేక్షించడానికి వీలుగా, అందరికీ కనిపించే ప్రదేశాలలో ఉంచాలి. గోప్యతా విధానాలను (ప్రైవసీ ?లసీ) జాగ్రత్తగా చదవాలి' అని స్టడీ రి?ోర్ట్ తల్లిదండ్రులకు సూచించింది.

## నిజ ప్రపంచం వర్సెస్ సాంకేతిక ప్రపంచం

పిల్లల ఆలోచన విధానంపై ఏఐ ప్రభావం ఆందోళన కలిగిస్తుంది. ఏఐ సాధనాలపై అతిగా ఆధారపడడం వల్ల మేధోపరమైన కృషి తగ్గుతుంది అంటున్నారు విశ్లేషకులు. 'ఏఐ బొమ్మలపై అతిగా ఆధారపడితే పిల్లల మెదడులోని భాగాలు అభివృద్ధి చెందడం ఆగి?ోతాయి' అని హెచ్చరిస్తున్నారు. నిజ ప్రపంచం సంక్లిష్టమైనది, అనూహ్యమైనది. మనుషులు తమ జీవితానుభవాల ద్వారా ఎలా మసలుకోవాలో నేర్చుకుంటారు. దీనికి విరుద్ధంగా ఏఐ పరిమితమైన సమాచారంతో పనిచేస్తుంది. 'ఒక పిల్లవాడి చుట్టూ ఉన్న అన్ని రకాల భావోద్వేగాలను ఏఐ బొమ్మలు అందుకోలేవు. దాని ప్రతిస్పందనలు అసంపూర్ణంగా, అనుచితంగా ఉంటాయి. ఇది తప్పుడు మార్గదర్శకత్వానికి దారి తీయడమే కాకుండా సృజనాత్మకంగా ఆలోచించడాన్ని తగ్గించవచ్చు, స్వతంత్రంగా సమస్య పరిష్కారానికి ఆలోచించే అవకాశాలను తగ్గించవచ్చు' అంటుంది జో బర్నార్డ్.

# రవి అస్తమించినా సౌర కాంతులు!



సాధారణంగా సూర్యుడు అస్తమిస్తే సోలార్ ప్లాంట్ల పని ముగిసిపోతుంది. కానీ చైనాలోని గోబీ ఎడారిలో ఉన్న దున్‌హువాంగ్ సోలార్ ప్లాంట్‌ను చూస్తే అది నిజం కాదనిపిస్తుంది. నిప్పులు కురిపించే ఎడారి ఎండను ఒడిసిపట్టి రాత్రి వేళ కూడా విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ ఈ ప్లాంట్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. దాదాపు 12,000 భారీ అద్దాలతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు పునరుత్పాదక ఇంధన రంగంలో ఒక సరికొత్త విప్లవమని ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

## ఏమిటీ ప్లాంట్ ప్రత్యేకత?

ఈ ప్లాంట్ మనం చూసే సాధారణ ఫోటోవోల్టాయిక్ ప్యానెళ్లతో పనిచేసేది కాదు. దీన్ని 'మోల్టెన్ సాల్ట్ కాన్సంట్రేటెడ్ సోలార్ పవర్' (సీఎస్‌పీ) ప్లాంట్ అని పిలుస్తారు. దీని నిర్మాణం చూస్తే మధ్యలో ఒక భారీ టవర్, దాని చుట్టూ వేల సంఖ్యలో అద్దాలు అమర్చి ఉంటాయి. ఇక్కడ ఉన్న 12,000 అద్దాలు సూర్యుడు కదులుతున్న దిశకు అనుగుణంగా వాటికి అవే పొజిషన్‌ను సర్దుబాటు చేసుకుంటాయి. ఇవి సూర్యరశ్మిని పరావర్తనం చెందించి సరిగ్గా 260 మీటర్ల ఎత్తున్న సెంట్రల్ టవర్‌పైకి కేంద్రీకరిస్తాయి. ఆ టవర్ పైభాగంలో ఉండే రిసీవర్‌లో 'ద్రవ ఉప్పు'(మోల్టెన్ సాల్ట్) ఉంటుంది. అద్దాల నుంచి వచ్చే తీవ్రమైన వేడి వల్ల ఈ ఉప్పు సుమారు 565 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకు చేరుకుంటుంది.

## రాత్రి పూట విద్యుత్తు ఎలా సాధ్యం?

ఈ ప్లాంట్‌లోని అసలైన మ్యాజిక్ ఇక్కడే ఉంది. పగటిపూట వేడెక్కిన ఈ ద్రవ ఉప్పును భారీ ఇన్సులేటెడ్ ట్యాంకుల్లో నిల్వ చేస్తారు. ఈ ఉప్పు తనలోని వేడిని చాలా కాలం పాటు కోల్పోదు. సూర్యుడు లేని సమయంలో లేదా రాత్రి వేళల్లో ఈ వేడి ఉప్పును ఉపయోగించి నీటిని ఆవిరిగా మారుస్తారు. ఆ ఆవిరి ద్వారా టర్బైన్లను తిప్పి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. తద్వారా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా సాధ్యమవుతుంది. ఈ టవర్ ద్వారా ఏటా సుమారు 390 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఏటా సుమారు 3.5 లక్షల టన్నుల కార్బన్ ఉద్గారాలను దీని ద్వారా తగ్గిస్తున్నారు.

## భవిష్యత్తుకు మార్గదర్శి

ప్రపంచం ప్రస్తుతం శిలాజ ఇంధనాల నుంచి స్వచ్ఛమైన ఇంధనం వైపు మళ్లుతోంది. బ్యాటరీ స్టోరేజ్ ఖరీదైన వ్యవహారంగా ఉన్న తరుణంలో 'మోల్టెన్ సాల్ట్' ద్వారా ఉష్ణాన్ని నిల్వ చేయడం అనేది అత్యంత చౌకైన, సమర్థవంతమైన మార్గం. దున్‌హువాంగ్ ప్రాజెక్టు కేవలం చైనాకే కాదు, ఎడారి ప్రాంతాలు ఎక్కువగా ఉన్న భారత్ వంటి దేశాలకు కూడా ఒక గొప్ప అవకాశం అని కొందరు సూచిస్తున్నారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మరో ప్రమాదం



విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మరో ప్రమాదం జరిగింది. స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్–1లో ప్రమాదం చోటుచేసుకుంది. ల్యాడిల్ నుంచి ద్రవపు ఉక్కు నేలపాలైంది. గతంలో ఇదే విభాగంలో ప్రమాదం జరిగి కార్మికులు మృతిచెందిన సంగతి తెలిసిందే. ప్రత్యేక పూజల తర్వాత తిరిగి ఇవాళ సీడీసీ ప్రారంభమైంది. సీడీసీ తిరిగి ప్రారంభించిన రోజు స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. ఎవరికి ఏమీ కాకపోవడంతో కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా, గత జులైలో స్టీల్‌ప్లాంట్ కోకోవేన్ విభాగంలో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందారు. ఐరన్ పడటంతో తీవ్ర గాయాలతో మృతిచెందారు. జూన్ నెలలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్లాంట్‌లో తరుచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా గ్యాస్ లీకేజ్, పేలుళ్లు, ద్రవ లోహం లీకేజ్ వంటి ఘటనలు జరుగుతూనే ఉండటంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికుల భద్రత ప్రశ్నార్థకరంగా మారింది.

## మంత్రి కొల్లు రవీంద్రకు పేర్ని నాని స్ట్రాంగ్ కౌంటర్



కృష్ణా జిల్లా: కొల్లు రవీంద్రలా కడుపులో కత్తులు పెట్టుకుని తిరిగేవాళ్లం కాదని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని అన్నారు. మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గ ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు పేర్ని నాని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ.. కులం చూసి ఓటేయమని తానెప్పుడూ అడగలేదన్నారు. కొల్లు రవీంద్ర నీకు ఎన్ని బూతులు వచ్చో.. నాకు అంతకంటే ఎక్కువే బూతులు వచ్చు. నేనూ బందరులోనే పుట్టా.. బందరులోనే చదువుకున్నా. నేను తిట్టాలంటే శత సహస్ర నామాలు లాగా నువ్వు పుస్తకం రాసుకున్నా సరిపోదు. గాలి ఉంటే గెలుస్తావ్.. గాలి లేకపోతే గెలవలేవు. బందరు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత మీకు లేదు" అంటూ పేర్ని నాని దుయ్యబట్టారు. "నా తండ్రి, నేను బందరుకు ఏం చేశామో ప్రజలకు తెలుసు. తరకటూరు పంపుల చెరువు నా తండ్రి చేసిందే. బందరులో 132కేవి పవర్ సబ్ స్టేషన్ నిర్మాణం చేయించింది నా తండ్రి. తీర ప్రాంత గ్రామాలకు మంచినీరు అందించిన ఘనత నా తండ్రిది. బందరులో 25 వేల మందికి ఇళ్లపట్టాలిచ్చిన చరిత్ర మాది. నువ్వు ఇప్పుడు టిడ్కో ఇళ్లు కట్టామని చెప్పుకుంటున్న భూమి కొన్నది కూడా మేమే...నీ మంత్రి పదవి కోసం బెల్ కంపెనీని నిమ్మకూరుకు తాకట్టు పెట్టిన చరిత్ర నీది. కృష్ణా యూనివర్శిటీ బందరుకు తెచ్చాం. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ బందరుకు తెచ్చాం. మెడికల్ కాలేజీను బందరుకు తీసుకొచ్చాం. గ్రామ గ్రామానికి తరకటూరు చెరువు నుంచి మంచినీరు తీసుకెళ్లాం. తారు రోడ్డు అంటే తెలియని అనేక గ్రామాలకు రోడ్డు వేయించాం." అని పేర్ని నాని వివరించారు. "కరెంట్ ఆపితే తప్ప మంచినీటి ఇవ్వలేని పరిస్థితి. నేను మంత్రిగా ఉన్నప్పుడు కరెంట్ ఇవ్వాలని ధర్నా చేయించావు. ఇప్పుడు నువ్వు మంత్రివే కదా... అధికారం మీదే కదా? గంట పాటు కరెంట్ ఆపకుండా ఎందుకు మంచినీరు ఇవ్వలేకపోతున్నారు?. కాపులకు ఏం చేశావ్.. అని నన్ను అడుగుతున్నావ్. నువ్వేం చేశావ్.. కాపులకు సమాధానం చెప్పు. మున్సిపల్ ఛైర్మన్ పదవిని ఆర్యవైశ్యుల వద్ద 60 లక్షలు వసూలు చేసింది నువ్వు. ఫలానా పదవి ఇస్తానని... నేను ఏనాడూ ఎవరికి టిక్కెట్లు ఇవ్వలేదు...కష్టపడి పనిచేసే వారికి ... నికార్సైన వారికే మేం టిక్కెట్లు ఇచ్చాం. జనసేనలో నిఖార్సైన డబ్బులేని కాపులెవరూ కనిపించలేదా నీకు?. ఎందుకు డబ్బున్నోడికే మేయర్ టిక్కెట్ ఇస్తామంటున్నారు. వైఎస్ జగన్ సాయంతో స్థలాలు కొని నిజాయితీగా 25 వేల ఇళ్లపట్టాలిచ్చాం. 25 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చిన నాకు దొంగ పట్టాలివ్వాల్సిన కర్మ పట్టలేదు. మేం ఇచ్చింది దొంగ పట్టాలైతే ఇంటింటికి వీఆర్వోలను ఎందుకు తిప్పుతున్నావు. నన్ను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు అధికారులను ఇబ్బంది పెడుతున్నావు. పేర్ని నాని ఏరోజూ ఏ ఒక్కరి ఇల్లు కూల్చలేదు...నీ కోసం పనిచేసిన జనసేన కార్యకర్తను కూల్చి వేయించిన చరిత్ర నీది. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ గుమ్మటాల చెరువులో ఈరోజుకీ నువ్వు ఇళ్లు అమ్ముకుంటున్నావు. బందరుకు నువ్వేం చేశావో.. నువ్వు ఏం తెచ్చావో చెప్పే దమ్ముందా?. గిలకలదిండిలో 22 బెల్టు షాపులు పెట్టించావ్. దొంగతనంగా బయోడీజిల్ అమ్మే దొంగవి నువ్వు. పాపపు సొమ్ముతో బీచ్‌లో 63 అడుగుల వినాయకుడు పెడితే మీ పాపాలు పోతాయా?. రైతులు సాగుకు నీరు లేక నానా అవస్థలు పడుతుంటే నువ్వు పట్టించుకున్నావా?" అంటూ పేర్ని నాని నిలదీశారు.ు

## కొల్లు రవీంద్రకు ఇదే నా ఛాలెంజ్: పేర్ని కిట్టు



కృష్ణా జిల్లా: అధికారం పోగానే కొందరు తెల్లారికే కండువా మార్చేసి దర్జాగా తిరిగేస్తున్నారని.. కానీ కార్యకర్తలే పార్టీకి, మాకు అండగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇంఛార్జ్ పేర్ని కిట్టు అన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటిపై టీడీపీ జెండా ఉన్నా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాలు అందించాం. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీనైనా కూటమి సర్కార్ నెరవేర్చిందా? అంటూ ప్రశ్నించారు. "కొల్లు రవీంద్రకు ఇదే నా ఛాలెంజ్. గతంలో టీడీపీ తరపున మేయర్ క్యాండెట్ కోసం నువ్వెంత తీసుకున్నావు? నేను చెప్పింది అబద్ధమైతే బందరుకోటలో కట్టిన గుడిలో ప్రమాణం చేద్దాం. కొల్లు రవీంద్ర దయచేసి మాతో నిన్ను పోల్చుకోకు. సీట్లు అమ్ముకునే నీకు, పార్టీ శ్రేణులను కుటుంబసభ్యులు అనుకునే మాకు చాలా తేడా ఉంది. ..బయట ఒకలా.. లోపల ఒకలా బతికే నువ్వు కూడా మాకు నీతులు చెబితే ఎలా?. పోర్టు పేరుతో 33 వేల ఎకరాలు తీసుకుని జనాన్ని మింగేయాలనుకుంది మీరు.. కేవలం 1700 ఎకరాల ప్రభుత్వ భూమిలో వైఎస్ జగన్ పోర్టు కట్టి చూపించారు" అని పేర్ని కిట్టు పేర్కొన్నారు.

## మయన్మార్‌లో వైమానిక దాడి.. 49 మంది మృతి



రఖైన్: మయన్మార్‌లోని పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో ఓ రద్దీగా ఉండే మార్కెట్ సమీపంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో 49 మంది మృతి చెందారు. మరో 58 మంది గాయపడ్డారు. మయన్మార్ సైన్యంపై పోరాడుతున్న అరాకాన్ ఆర్మీ, స్థానిక సహాయక సిబ్బంది ఈ విషయాన్ని వెల్లడించారు. మృతుల్లో వ్యాపారులు, కొనుగోలుదారులు, పాదచారులు ఉన్నట్లు తెలిపారు. క్యాక్టావ్ టౌన్‌షిప్‌లో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. అరాకాన్ ఆర్మీ ప్రకారం.. ఓ యుద్ధ విమానం స్థానిక మార్కెట్ సమీపంలో రెండు బాంబులు జారవిడిచింది. ఈ దాడిలో 49 మంది మృతి చెందగా.. 58 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో 22 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు రఖైన్‌కు చెందిన సీనియర్ సహాయక అధికారి వై హున్ ఆంగ్ తెలిపారు. ఈ మార్కెట్ రఖైన్ రాష్ట్రంలో ప్రధాన టోకు వ్యాపార కేంద్రంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు ఇక్కడికి వస్తుంటారని ఆయన చెప్పారు. దాడి అనంతరం భవనాలు దెబ్బతిన్నట్లు, వాహనాలు కాలిపోయినట్లు, సమీపంలోని వంతెనలోని కొన్ని భాగాలు ధ్వంసమైనట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న చిత్రాలు, వీడియోలు చూపిస్తున్నాయి. అయితే ఈ దాడికి సంబంధించిన వివరాలను స్వతంత్రంగా ధ్రువీకరించలేదని వార్తా సంస్థలు తెలిపాయి. మయన్మార్ సైన్యం ఈ ఘటనపై వెంటనే స్పందించలేదు. సైన్యం గతంలో తమ వైమానిక దాడులు చట్టబద్ధమైన సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుంటాయని, సాయుధ ప్రతిఘటన బృందాలు ఉగ్రవాదానికి పాల్పడుతున్నాయని ఆరోపించింది. అయితే మార్కెట్ ప్రాంతంపై ఉద్దేశపూర్వకంగానే దాడి చేసి భారీగా పౌరుల ప్రాణనష్టానికి కారణమైందని అరాకాన్ ఆర్మీ ఆరోపించింది. ఈ దాడులకు ప్రత్యక్షంగా బాధ్యులైన వ్యక్తులు, సంస్థలపై త్వరలో ప్రతీకార చర్యలు తీర్చుకుంటామని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించింది. 2021 ఫిబ్రవరి 1న ఆంగ్ సాన్ సూకీ నేతృత్వంలోని ఎన్నికైన ప్రభుత్వాన్ని మయన్మార్ సైన్యం తొలగించినప్పటి నుంచి దేశంలో ఘర్షణలు కొనసాగుతున్నాయి. సైనిక పాలనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలపై భద్రతా బలగాల అణచివేతతో పలువురు ఆయుధాలు చేపట్టారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లో జాతి ఆధారిత సాయుధ సంస్థలు తమ పోరాటాన్ని తీవ్రతరం చేశాయి. దీంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో సైన్యానికి, ప్రతిఘటన బలగాలకు మధ్య పోరాటం కొనసాగుతోంది.

# పుస్తకం 'ఉత్త' భూషణం



'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్' అంటూ సరస్వతీ ప్రార్థనతో ఒక చాటుపద్యం ప్రారంభమవుతుంది. 'నువ్వు నా మనసులో నిలిచి, మంచి, అందమైన మాటల్ని ధారగా ఇష్టంగా నాతో పలికించ'మని ఆ పద్యకవి ఆమెను ప్రార్థిస్తాడు. 'జగత్తునే మోహపెట్టేదిగా, విప్పారిన కన్నులూ, పూర్ణచంద్రునివంటి ముఖమూ కలిగినదిగా' ఆమెను సంబోధిస్తాడు. మరో కోణంలో ఈ పద్యం పుస్తకమెలా ఉండాలో చెబుతోంది-- అది వాగ్ధారతోనే కాక, ఆ వాక్కులు మంచివిగానూ, అందంగానూ ఉండాలంటోంది. సరస్వతికి ఉపయోగించిన విశేషణాలను పుస్తకానికి కూడా అన్వయిస్తే, అది పాఠకజగత్తును మోహపెట్టేలా, వారి చూపుల్ని విశాలపరిచేలా, పూర్ణచంద్రుడిలా ఆహ్లాదం గొలిపేలా ఉండాలి. పుస్తకమెలా ఉండాలో చెప్పడమంటే, ఎలా ఉండకూడదో చెప్పడమే. పుస్తకాన్ని దేవతతో ముడిపెట్టడమంటేనే, దానికి పవిత్రతను ఆపాదించడం! అందం, ఆహ్లాదం, పవిత్రతా వగైరాలనలా ఉంచితే, పుస్తకంపట్ల కనీసమైన భక్తి శ్రద్ధలను, బాధ్యతను చాటుకుంటున్నామా? తొలినాటి వాగ్రూపదశ దాటి, లేఖనంతో మొదలైన తాళపత్రాలు, భూర్జపత్రాలదశలోకీ కాగితం దశలోకీ అడుగుపెట్టి అక్కడి నుంచి తాజాగా ఆడియో పుస్తకాల రూపంలో మరోసారి వాగ్రూపానికి చేరుకున్న ఇన్ని వందల, వేల సంవత్సరాల వ్యవధిలో కూడా పుస్తకరచననూ, ప్రచురణనూ ఉన్నత ప్రమాణాలు కలిగిన ఒక వ్యవస్థగా మనం పూర్తిగా అభివృద్ధి చేసుకోగలిగామా? సినిమా వంటి నిన్నమొన్నటి జనమాధ్యమాలతో పోటీపడే స్థాయిలో పుస్తకాన్ని జనసామాన్యంలోకి తీసుకెళ్ళగలిగామా? కవులు, రచయితలకిచ్చే గుర్తింపును-- నటులకు, నాయకులకు ఇచ్చే గుర్తింపులో సగానికైనా పెంచగలిగామా? ఇప్పుడు మరింత ఎక్కువమందికి అందు బాటులోకి వచ్చిన పుస్తకం ద్వారా జ్ఞాన, విజ్ఞాన, సారస్వతవ్యాప్తిలో మరింత పురోగ మనాన్ని సాధించే బదులు తిరోగమనాన్ని చిత్తగించిన దాఖలాల సంగతేమిటి?! సరస్వతిలానే ప్రకృతి కూడా తల్లే. ఆ తల్లి జీవపరిణామ క్రమంలో మనిషికి మెదడు నిచ్చింది; ఆ మెదడు జ్ఞాన, విజ్ఞాన, సారస్వతావిష్కారాల వైపు మనిషిని నడిపించింది; మెదడుకు సమాంతరంగా ప్రకృతి ప్రసాదించిన మాట ఆ జ్ఞాన, విజ్ఞానాదులను తోటి మనిషితో పంచుకునే సౌలభ్యమిచ్చింది. అప్పటినుంచీ జ్ఞాన, విజ్ఞానవ్యాప్తిలో మనిషి మడమ తిప్పింది లేదు. వాక్కునే జ్ఞానవాహిక చేసుకుని మాటలల్లి, వాటికి ఆటపాటలు జోడించి జనంలోకి తీసుకెళ్ళి భావి కావ్యేతిహాసాలకు బీజావాపం చేసిన చరిత్ర మనిషిది. ఆదికవి నన్నయ భట్టు తన ఆంధ్రమహాభారత కృతిభర్త రాజరాజనరేంద్రుని ఆస్థానాన్ని వర్ణిస్తూ-- అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులు, భారతరామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులు, నవార్థవచనరచనా విశారదులైన మహాకవులు, సమస్తశాస్త్ర సాగర గరీయ ప్రతిభులైన తార్కికులు మొదలైన విద్వజ్జనాలు ఆయనను పరివేష్ఠించి ఉన్నారంటాడు. శ్రీనాథ మహాకవి విజయనగరంలో ప్రౌఢదేవరాయల ఆస్థాన పండితు డైన గౌడడిండిమ భట్టును శాస్త్రవాదంలో ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించడం మరో ప్రసిద్ధ ఉదాహరణ. ఏ జ్ఞానరంగంలోనైనా అపశబ్దాలు, అపరిణతులు, అతర్కాలు, కుతర్కాలు చోటు చేసుకోకుండా ఆనాటి గురువులతోపాటు, పండితపరిషత్తులు అంకుశంలా పనిచేస్తూ జ్ఞానస్వచ్ఛతను పరిరక్షించడానికి ప్రయత్నించాయి. ఇప్పటి పుస్తక ప్రచురణ భాషలో చెప్పాలంటే 'పరిష్కర్త' పాత్రను నిర్వహించాయి. అటువంటిది, కాగితమూ, అచ్చుయంత్రమూ అందుబాటులోకి రావడంతో పుస్తకరూపం ధరించిన జ్ఞానం పండిత పరిషత్తు లనూ, రాజాస్థానాలను దాటి వందల సంవత్సరాల క్రితమే ప్రజాస్థానంలోకి అడుగు పెట్టినా, మనదేశంలో ఇప్పటికీ పుస్తకప్రచురణ ఉన్నత ప్రమాణాలు కలిగిన వ్యవస్థగా అభివృద్ధి చెందకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పుస్తకమూ, పుస్తక రచనా ప్రజాస్వామికమవుతూ అన్ని వర్గాలకూ అందుబాటులోకి రావడం శుభపరిణామ మను కుంటే; 'పరిష్కర్త' రూపంలో అంకుశం లోపించి నాణ్యత అడుగంటడాన్ని ఎలా చూడాలి? దాంతో పుస్తకాలు అనేకం అమ్ముకునే స్థాయికి చేరకుండా ఉచితంగా పంచి పెట్టే స్థాయిలోనే ఉండిపోతున్నాయి. దాని ప్రభావం మంచి పుస్తకాలపైనా పడుతోంది. ఇప్పటికైనా మేలుకుని ప్రచురణ రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుకోకపోతే హస్తభూషణం కావలసిన పుస్తకం 'ఉత్త' భూషణంగానే ఎప్పటికీ ఉండిపోతుంది.

# ముక్త(సరి) కంఠం!




ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు శనివారం సమావేశమై ఎన్నికల సంఘం(ఈసీ) నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తమ మధ్య విభేదాలున్నాయన్న కథనాలను తోసిపుచ్చారు. అలా ప్రకటించటానికి రెండు రోజులు పట్టిందంటేనే గృహచ్ఛిద్రాలు దండిగా వున్నాయని అర్థం. మీడియాతో నేరుగా మాట్లాడితే దొరికిపోతామన్న బెరుకు వారిలో ఉన్నదని తాత్పర్యం. దేశవ్యాప్తంగా ప్రజల్లో, పార్టీల్లో ఎన్నో సందేహాలూ, భయాందోళనలూ రేకెత్తించిన వ్యవహారం నాలుగు పేజీల ప్రెస్ నోట్‌తో, ముగ్గురు కమిషనర్ల గ్రూప్ ఫొటోతో సరిపెట్టుకోమంటే ప్రజాస్వామ్యంలో చెల్లదు. వ్యవస్థలు అంతర్గత కలహాల్లో కొట్టుమిట్టాడాలని ఎవరూ కోరుకోరు. కానీ మీడియా కథనాలకు స్పష్టమైన వివరణ ఉండాలా, వద్దా? పారదర్శకంగా, ప్రామాణికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన సంస్థ దాపరికంతో ఉందంటే దాని విశ్వసనీయత, కార్యకలాపాలూ ప్రశ్నార్థకం కావా? ఇద్దరు కమిషనర్లూ లేవనెత్తిన ప్రశ్నలు వారి వ్యక్తిగత తగవు కాదు. అది ఓటు హక్కు కోల్పోయిన కోట్లాదిమంది పౌరుల జీవన్మరణ సమస్యతో ముడిపడి వున్నది. ఈసీ వంటి ఒక కీలక వ్యవస్థలో నిబంధనలు బేఖాతరవుతూ ఇష్టారాజ్యం నడుస్తున్నదన్న అభిప్రాయం కలిగించిన ప్రశ్నలవి. ఈసీ ప్రకటన తీర్చిన సందేహాలకన్నా, రేకెత్తించిందే అధికం. సంధూ, వివేక్ జోషిలిద్దరూ పది నెలల వ్యవధిలో ఏకంగా 14 సార్లు రికార్డుపూర్వకంగా అభ్యంతరం చెప్పారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం అంటున్నది. ఎందుకలా జరిగిందో, వారి అభ్యంతరాలేమిటో ఈసీ చెప్పొద్దా? ఈసీఐనెట్ పోర్టల్‌లో ఫామ్--6కి చేసిన సాంకేతిక మార్పులకు చట్టబద్ధత లేదంటూ వారిద్దరూ వేలెత్తిచూపారని కథనం. అది జరగనేలేదని ఈసీ ప్రకటన ఎక్కడా పేర్కొనలేదు. ఫామ్--6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ప్రకటన చెబుతోంది. అది బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) సాగుతున్న సందర్భం వరకూ వాస్తవం. కానీ అటుపై చేసిన మార్పులపై కదా రగడ! దాన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత లేదా? ఢిల్లీలో సాగిన 'సర్'పై సమాచార హక్కు కార్యకర్త అంజలీ భరద్వాజ్, అమృత జోహ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై గత మంగళవారం విచారణ సందర్భంగా ఆ ప్రక్రియ యాంత్రికంగా సాగిందన్న అభిప్రాయం కలుగుతున్నదని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. అక్కడున్న 97 లక్షల మందికి పైగా ఓటర్లలో 47 లక్షలమంది పేర్లు జాబితాల నుంచి తొలగించారు. ఇందులో 33 లక్షలకుపైగా మందికి 'తార్కిక వ్యత్యాసాల' పేరిట నోటీసులు జారీ అయ్యాయి. ఇదంతా ఈ ముగ్గురి సమష్టి నిర్వాకమో... లేక మీడియా కథనం అంటున్నట్టు మైనారిటీ నిర్ణయం పర్యవసానమో సంజాయిషీ ఇవ్వొద్దా? డేటా నిర్వహణ విషయంలోనూ, కేంద్ర కేబినెట్ కార్యదర్శికి రాసిన లేఖ విషయంలోనూ ఇదే దాపరికం! జాతీయ మీడియాలో కథనాలు వెలువడి అల్లరైంది గనుక ఈమాత్రం వివరణైనా ఇచ్చారు. 2024లో ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ(వైఎస్సార్‌సీపీ) ఫిర్యాదుచేసినా, ప్రతినిధి బృందం కలిసినా జవాబు లేదు. ఆ ఎన్నికలు ఆద్యంతమూ బరితెగింపే. ఎన్నికలకు ముందు కూటమి సలహాతో అధికారుల్ని మార్చడం మొదలుకొని వేకువజామువరకూ పోలింగ్ సాగటం, అర్ధరాత్రి లక్షలమంది ఓటేయటం, నిబంధనలకు విరుద్ధంగా వీవీ ప్యాట్ స్లిప్‌లు, సీసీ కెమెరా ఫుటేజ్‌లు ధ్వంసం చేయడంవరకూ ఈ దుర్నీతి యథేచ్ఛగా సాగింది. అదేమంటే మౌనమే సమాధానం. ఇందువల్ల టీడీపీ దండిగా లాభపడింది. అందుకే 'ఎక్స్‌ప్రెస్' కథనాల తర్వాత అపోహలు తొలగించాలంటూ ఒక మాయదారి ప్రకటన చేసి... ఈసీ 'వివరణ' వెలువడిన మరుక్షణమే సందేహనివృత్తి అయిందంటూ ఆ పార్టీ కొనియాడింది. ఆ వివరణ రాజ్యాంగ సంస్థల నిజాయతీ, విశ్వసనీయతల్ని పునరుద్ధాటించిందంటూ సీఎం చంద్రబాబు సిగ్గుమాలిన ప్రకటనొకటి చేశారు. అవేమిటో అంశాల వారీగా చెబితే అందరూ విని తరిస్తారు. మౌనంతోనో, అరకొర వివరణతోనో వంచించటం ఎల్లకాలమూ సాగదనీ, తీరు సరిగా లేనపుడు జనం నిలదీస్తారనీ ఈసీ తెలుసుకోవాలి.

# పార్కిన్‌సన్స్ బాధితుల కోసం స్మార్ట్ సాక్స్!



పార్కిన్‌సన్ వ్యాధి ఉన్నవారు ఒక్కోసారి కాళ్లు కదలక నడవలేకపోతారు. ఇలా జరగడాన్ని 'ఫ్రీజింగ్ ఆఫ్ గెయిట్' అంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇటలీలోని మిలాన్ పాలిటెక్నిక్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు విద్యార్థులు ఆర్ఫియస్ అనే స్మార్ట్ సాక్స్‌ను తయారు చేశారు. ఈ సాక్స్‌లో ఉండే చిన్నచిన్న పరికరాలు... బాధితులు కోరిన సంగీతానికి అనుగుణంగా కాళ్లకు స్వల్పమైన కంపనాలు ఇస్తాయి. నడుస్తున్నప్పుడు ఈ కంపనాలు లయబద్ధంగా వెలువడుతూ కాళ్లు కదలడానికి సహాయపడతాయి. ఈ వినూత్న ఆలోచన '2026 ఏడాదికి జేమ్స్ డైసన్ అవార్డు'కు ఎంపికైంది.

### ఇష్టమైన పాటల రిథమ్‌కు అనుగుణంగా కంపనాలిలా...

ఆర్ఫియస్ సాక్స్‌లో పాదాలు, కింది కాలి భాగంలో మొత్తం ఎనిమిది చిన్న వైబ్రేషన్స్ ఇచ్చే పరికరాలు ఉంటాయి. అవసరమైన ప్రాంతానికి కంపనాలు అందించడంలో ఇవి సహాయపడతాయి. ఈ సాక్స్‌ను మొబైల్ యాప్‌తో అనుసంధానించడం ద్వారా 'స్పాటిఫై'లో తమకు ఇష్టమైన పాటలను బాధితులు ఎంపిక చేసుకోవచ్చు. ఆ సంగీతంలోని రిథమ్‌కు తగినట్లుగా సాక్స్‌లోని పరికరాలు కాళ్లకు కంపనాలను అందిస్తాయి. ఇందుకోసం హెడ్‌ఫోన్స్ కూడా అవసరంలేదు. ప్రస్తుతం ఈ ఆర్ఫియస్ ఇంకా ప్రాథమిక నమూనా (ప్రోటోటైప్) దశలోనే ఉంది. దీన్ని మరింత చిన్నదిగా, సౌకర్యవంతంగా తయారు చేయడంతోపాటు నడుస్తున్నప్పుడు కాళ్లు అకస్మాత్తుగా ఆగిపోవడాన్ని గుర్తించే 'ఫ్రీజ్ డిటెక్షన్ టెక్నాలజీ'ని కూడా ఇందులో చేర్చేందుకు పరిశోధక విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇవి వాణిజ్యపరంగా అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడేళ్లు పట్టవచ్చని వారు చెబుతున్నారు.

### యువతలో పెరుగుతున్న పక్షవాతం కేసులు!

సాధారణంగా వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే పక్షవాతం ఇటీవల యువతలో పెరిగినట్లు ఓ అమెరికన్ అధ్యయనంలో తేలింది. దాదాపు మూడు దశాబ్దాల కాలంలో 20 ఏళ్ల నుంచి 54 ఏళ్ల మధ్య వయసు వారిలో పక్షవాతం కేసులు దాదాపు రెట్టింపయ్యాయని పరిశోధకులు గుర్తించారు. అయితే స్ట్రోక్ వచ్చిన తర్వాత మొదటి 30 రోజుల్లో మరణించే వారి శాతం మాత్రం కొంత తగ్గింది. ఈ అధ్యయనంలో భాగంగా 20 ఏళ్ల నుంచి 54 ఏళ్ల మధ్య వయసున్న వారిలో తొలిసారి పక్షవాతం వచ్చిన 2,076 కేసులను పరిశోధకులు గుర్తించారు. 1993--94లో ప్రతి లక్ష మంది యువతలో ఏడాదికి సుమారు 33.9 స్ట్రోక్ కేసులు నమోదవగా 2020 నాటికి ఈ సంఖ్య 62.2కు పెరిగింది. యువతలోని పక్షవాతం కేసుల్లో ప్రధానంగా ఇస్కీమిక్ స్ట్రోక్స్ ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. మెదడులోని ఏదైనా భాగానికి రక్తాన్ని తీసుకెళ్లే నాళంలో అడ్డంకి ఏర్పడి రక్తప్రసరణ నిలిచిపోవడం వల్ల వచ్చే స్ట్రోక్‌ను ఇస్కీమిక్ స్ట్రోక్‌గా పిలుస్తారు. 1993--94లో ప్రతి లక్ష మందిలో ఏడాదికి 23.8 ఇస్కీమిక్ స్ట్రోక్ కేసులు నమోదైతే 2020 నాటికి ఈ సంఖ్య 47.3కు పెరిగింది. అయితే మెదడులో రక్తనాళం చిట్లడంతో రక్తస్రావం జరగడం వల్ల వచ్చే ఇంట్రాసెరెబ్రల్ హెమరేజ్, మెదడు చుట్టూ రక్తస్రావం వల్ల వచ్చే సబ్‌అరాక్నాయిడ్ హెమరేజ్ వంటి ఇతర రకాల స్ట్రోక్స్‌లో మాత్రం ఈ పెరుగుదల కనిపించలేదు. పక్షవాతానికి గురైన యువతను పరిశీలించినప్పుడు... గతంతో పోలిస్తే వారిలో హైబీపీ, డయాబెటిస్ వంటి కొన్ని సమస్యలు పెరిగినట్లు పరిశోధకులు గుర్తించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటి పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ అధ్యయన వివరాలు న్యూరాలజీ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

### జంక్ ఫుడ్‌తో దీర్ఘకాలిక వ్యాధులు

అల్ట్రా--ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకునే వారిలో గుండె జబ్బులు, కేన్సర్, డయాబెటిస్, ఊబకాయం తదితర దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉండొచ్చని తాజా అధ్యయనంలో తేలింది. ఈ తరహా ఆహారం ఎక్కువగా తీసుకునే వారిలో ఏ కారణంతోనైనా మరణాల ముప్పు కూడా ఎక్కువగానే ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా అల్ట్రా--ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం బాగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై పరిశోధకులు ఇప్పటివరకు జరిగిన అధ్యయనాలను సమగ్రంగా విశ్లేషించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ వరకు ప్రచురితమైన పరిశోధనలను పరిశీలించారు. ఈ విశ్లేషణలో మొత్తం 51 అధ్యయనాలున్నాయి. ఆయా అధ్యయనాల్లో పాల్గొన్న వాలంటీర్ల ఆహార అలవాట్లను, వారి ఆహార చరిత్రను విశ్లేషించగా అల్ట్రా--ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడానికి.. కొన్ని ప్రధాన ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పునకు మధ్య సంబంధం ఉంటున్నట్లు పరిశోధకులు గుర్తించారు. అల్ట్రా--ప్రాసెస్డ్ ఫుడ్స్ రోజువారీ వినియోగం పెరిగేకొద్దీ అనారోగ్య సమస్యల ముప్పు కూడా పెరుగుతున్నట్లు డోస్ రెస్పాన్స్ అనాలసిస్‌లో కనిపించింది. రోజుకు అదనంగా 100 గ్రాముల అల్ట్రా--ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల హృద్రోగ సమస్యలు, కేన్సర్, ఏ కారణంతోనైనా మరణించే ముప్పు, మెటబాలిక్ సిండ్రోమ్/డయాబెటిస్ ముప్పు పెరగడంతో సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ పరిశోధనలో లభించిన ఆధారాలు తక్కువ స్థాయి నుంచి మధ్యస్థ స్థాయిలోనే ఉన్నాయని పరిశోధకులు పేర్కొన్నారు.

# సాయి పల్లవి గ్యాప్ తీసుకుందా? వచ్చిందా?

తెలుగు ప్రేక్షకులు అభిమానంతో లేడీ పవర్‌స్టార్ అని పిలుచుకునే సాయి పల్లవి టాలీవుడ్‌కి గ్యాప్ తీసుకుందా అనిపిస్తుంది. గడిచిన ఐదేళ్లలో సాయి పల్లవి తెలుగులో చేసిన సినిమాలు చాలా తక్కువ. అందులో ఎక్కువ శాతం సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా ఈమె హీరోయిన్‌గా నటించి చివరగా విడుదలైన సినిమాల్లో తండేల్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. వంద కోట్లకు మించిన వసూళ్లతో తండేల్ ఆ ఏడాది టాప్ చిత్రాల జాబితాలో నిలిచిన విషయం తెల్సిందే. అంతకు ముందు లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం సినిమాలతో వచ్చి హిట్ కొట్టింది. ముఖ్యంగా విరాట పర్వం సినిమాతో సాయి పల్లవికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఇలా వరుస విజయాలు దక్కించుకున్న సాయి పల్లవికి తెలుగులో ఎక్కువ ఆఫర్లు రావడం లేదా, లేదంటే సాయి పల్లవి వచ్చిన ఆఫర్లను తిరస్కరిస్తుందా అనేది చాలా మంది అనుమానం. ఇంకో వారం తండేల్ మూవీతో సాయి పల్లవి సూపర్ హిట్... గత ఏడాది తండేల్ సినిమాతో వచ్చిన తర్వాత సాయి పల్లవి పూర్తిగా బాలీవుడ్‌కి పరిమితం అయినట్లుగా వరుస హిందీ సినిమాలు చేస్తోంది. ఇప్పటికే 'ఏక్ దిన్' టైటిల్‌తో రూపొందిన సినిమాతో సాయి పల్లవి ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీలో రూపొందిన ఏక్ దిన్ సినిమా కమర్షియల్ ఫలితాన్ని పక్కన పెడితే సాయి పల్లవి నటనకు ఎప్పటిలాగే మంచి మార్కులు పడ్డాయి. సినిమాలో ఆమె ప్రధాన ఆకర్షణగా నిలిచింది అంటూ రివ్యూలు వచ్చాయి. ఏక్ దిన్ సినిమా తర్వాత సాయి పల్లవి క్రేజ్ బాలీవుడ్‌లో మరింతగా పెరిగిందని చెప్పుకోవచ్చు. ఇక దేశవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్న 'రామాయణ' సినిమాతోనూ సాయి పల్లవి మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. హిందీలో రూపొందిన రామాయణ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే.





బాలీవుడ్ రామాయణ సినిమాలో సీతగా... రామాయణ సినిమా కంటే ముందు సాయి పల్లవి నటించిన తమిళ్ 'ఓమ్' మూవీ విడుదల కాబోతుంది. వచ్చేనెలలో విడుదల కాబోతున్న ఓమ్ సినిమాలో ధనుష్ హీరోగా నటించాడు. హిట్ చిత్రాల దర్శకుడిగా పేరు సొంతం చేసుకున్న రాజ్‌కుమార్ పెరియాస్వామి దర్శకత్వంలో స్వయంగా ధనుష్ ఈ సినిమాను నిర్మించాడు.

సాయి అభ్యంకర్ సంగీతం అందించిన ఓమ్ సినిమాలో సాయి పల్లవి పాత్ర విషయమై ఇప్పటివరకు క్లారిటీ లేదు. అయితే ధనుష్ సినిమా కనుక సాయి పల్లవి పాత్రకు గొప్ప ప్రాధాన్యత ఉండక పోవచ్చు అనేది కొందరి అభిప్రాయం. హిందీ, తమిళ్ సినిమాలు చేస్తున్న సాయి పల్లవి తెలుగు సినిమాలను మాత్రం ఎందుకు దూరం పెడుతున్నట్లు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నాయి. సాయి పల్లవి కావాలని తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది అనే వారు చాలా మంది ఉన్నారు. అయితే ఆమెకు తగ్గ కథ రాకపోవడం వల్ల టాలీవుడ్‌కి దూరంగా ఉండాల్సి వస్తుందని కొందరు అంటున్నారు.

# బుల్లెట్స్‌కి బలుపు ఉండాలి



# బాలయ్య 'దాదా' గ్లింప్స్

బుల్లెట్స్‌కి బలుపు ఉండాలి: బాలయ్య 'దాదా' గ్లింప్స్

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో గతంలో వచ్చిన వీరసింహారెడ్డి బాక్సాఫీస్ వద్ద మాస్ ప్రేక్షకులను మంచి కిక్ ఇచ్చింది. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ పై మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి దాదా అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ మేకర్స్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 24న థియేటర్లలోకి రానుంది. ‌ముంబై బ్యాక్‌డ్రాప్‌ను తలపించేలా గేట్‌వే ఆఫ్ ఇండియా విజువల్స్, వర్షం నడుమ హిందీ వాయిస్‌ఓవర్‌తో గ్లింప్స్ మొదలవుతుంది. ఈ నగరంలో అతడి పేరు ఎత్తడానికే ఎంతో ధైర్యం కావాలంటూ పాత్ర స్వభావాన్ని ఎస్టాబ్లిష్ చేశారు. ఆ తర్వాత షేర్ ఆగయా అంటూ నందమూరి బాలకృష్ణ స్క్రీన్‌పైకి ఎంట్రీ ఇచ్చే విజువల్స్ కనిపిస్తాయి. లెదర్ జాకెట్, సన్ గ్లాసెస్ ధరించి సిగరెట్ కాలుస్తూ ఎప్పటిలాగే తనదైన మాస్ స్వాగ్‌తో బాలయ్య దర్శనమిచ్చారు. పోలీస్ స్టేషన్ సెటప్‌లో చుట్టుముట్టిన పోలీసుల మధ్య దర్జాగా కూర్చుని ఉన్న సీన్ హైలెట్ అయ్యింది. ఆ సీన్ తో హీరో క్యారెక్టర్‌లోని




డామినేషన్‌ను చూపించారు. అగ్గిపెట్టుందా అంటూ విసిరే డైలాగ్‌తో మొదలై, బాలయ్య మార్క్ ఫైట్ సీక్వెన్స్‌లతో సాగుతుంది. గొడ్డలి పట్టుకుని రక్తసిక్తమైన చేతులతో ప్రత్యర్థులను వేటాడే యాక్షన్ బ్లాక్స్ రెగ్యులర్ గోపీచంద్ మలినేని స్టైల్ లో డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. చివర్లో టేబుల్‌పై కూర్చుని చెప్పే 'అరేయ్.. నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్స్‌కి బలుపు ఉండాలి, గన్స్‌కి గట్సుండాలి' అనే పవర్ఫుల్ డైలాగ్ బాలకృష్ణ ఫ్యాన్స్‌ను ఆకట్టుకునేలా ఉంది. ఆ తర్వాత బ్యాక్‌గ్రౌండ్ కోరస్‌తో దాదా టైటిల్‌ను రివీల్ చేశారు. చేతిలో సుత్తి పట్టుకుని మాస్ లుక్‌లో విలన్లను కొట్టే విజువల్స్ కిక్ ఇచ్చేలా ఉన్నాయి. ఇక టెక్నికల్ అంశాల విషయానికి వస్తే, థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాలయ్య టెంపో లోనే ఉంది. గోపీచంద్ మలినేని గత సినిమాల మాదిరిగానే పూర్తిస్థాయి కమర్షియల్ హంగులతోనే ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇక దాదా టైటిల్ గ్లింప్స్ చూస్తే నందమూరి బాలకృష్ణ నుంచి ఫ్యాన్స్ ఆశించే మాస్ ఎలిమెంట్స్‌తో కూడిన ఒక రెగ్యులర్ కమర్షియల్ ప్యాకేజీలా కనిపిస్తోంది. మాస్ ను టార్గెట్ చేస్తూ పక్కా మాస్ లైనప్‌లోనే ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారు. క్రిస్మస్ కానుకగా రాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి.

## ఫౌజీపై రెండు మార్కెట్ల గేమ్..
# అదే బిగ్ ప్లస్ పాయింట్!




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఫౌజీపై అంచనాలు పెరుగుతున్నాయి. ప్రభాస్ కు ఉన్న పాన్ ఇండియా క్రేజ్ కు.. హను కథ చెప్పే విధానం తోడవుతుండటంతో ఆ ప్రాజెక్టుపై ఫుల్ హైప్ నెలకొంది. ముఖ్యంగా సినిమాకు రెండు వేర్వేరు మార్కెట్లను ఒకేసారి టార్గెట్ చేసే అవకాశం ఉండటం ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ప్రభాస్ స్టార్ డమ్.. మరోవైపు హను సినిమాలపై ఉన్న ప్రత్యేక గుర్తింపు.. ఫౌజీకి బిగ్ ప్లస్ గా మారే అవకాశం కనిపిస్తోంది. ప్రభాస్ కు తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీ మార్కెట్ లోనూ భారీ ఫాలోయింగ్ ఉంది. బాహుబలి తర్వాత ఆయన సినిమాలకు దేశవ్యాప్తంగా మార్కెట్ ఏర్పడింది. దీంతో కథ ఏ ప్రాంతానికి చెందినదైనా.. ప్రభాస్ సినిమా అనే కారణంతో అన్ని చోట్ల హైప్ ఏర్పడుతోంది. ఫౌజీ విషయంలోనూ ఇదే మెయిన్ స్ట్రెంత్ కానుంది. ఇక హను రాఘవపూడి సినిమాలకు మరో స్పెషాలిటీ ఉంది. కథలో యాక్షన్ ఉన్నప్పటికీ.. పాత్రల మధ్య ఎమోషన్, ప్రేమ, డ్రామాకు ఆయన ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తుంటారు. సీతారామంతో ఆయన కథన శైలికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఆ సినిమా ఎఫెక్ట్ కూడా ఫౌజీపై అంచనాలు పెరగడానికి ఒక కారణంగా కనిపిస్తోంది. ప్రభాస్ లాంటి భారీ స్టార్ తో హను ఎలాంటి కథను చెబుతారన్న ఆసక్తి అందరిలో ఉంది. ఇక్కడే ఫౌజీకి అసలు గేమ్ మొదలవుతుంది. సాధారణంగా స్టార్ హీరో సినిమాలకు యాక్షన్, భారీ సీన్స్ అట్రాక్షన్ గా ఉంటాయి. కానీ హను రాఘవపూడి మార్క్ కథనం వల్ల ఫౌజీలో ఎమోషనల్ కంటెంట్ కూడా కీలకంగా ఉండే అవకాశం ఉంది. అంటే ప్రభాస్ ను యాక్షన్ హీరోగా మాత్రమే కాకుండా.. ఒక పాత్ర చుట్టూ తిరిగే కథలో భాగంగా చూపించే ఛాన్స్ ఉంది. ఇది తెలుగు ప్రేక్షకులతో పాటు హిందీ మార్కెట్ లోనూ ఎక్స్ ట్రా అసెట్ గా మారింది. మరోవైపు పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ కూడా సినిమాకు ప్రత్యేకత తీసుకురానుంది. స్వాతంత్ర్యానికి ముందు కాలం బ్యాక్ డ్రాప్ లో సాగే కథ కావడంతో అప్పటి పరిస్థితులు, పాత్రల జీవితం, దేశభక్తి అంశాలు కథలో కీలకంగా ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఆ బ్యాక్ డ్రాప్ భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను కనెక్ట్ చేసే అవకాశం ఉంటుంది. అయితే పాన్ ఇండియా మార్కెట్ లో భారీ అంచనాలు ఉండటం ఎంత ప్లస్ పాయింటో.. అంతే పెద్ద బాధ్యత కూడా.

# అసలైన రాధా.. పుత్తడి బొమ్మలా ఆకట్టుకుంటున్న శ్రీ లీల!





శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హీరోయిన్స్ ఒక్కొక్కరిగా రాధా గా మారిపోయి తమ అందచందాలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ముఖ్యంగా కృష్ణాష్టమి పూర్తయి రెండు మూడు రోజులవుతున్న సోషల్ మీడియాలో మాత్రం ఆ వైబ్ ఇంకా తగ్గట్లేదు అని చెప్పాలి. మొన్నటికి మొన్న రాధగా మారి అనసూయ అద్భుతమైన డాన్స్ పెర్ఫార్మెన్స్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు పువ్వుల మధ్యలో పుత్తడి బొమ్మలా.. కృష్ణుడికై వేచిచూసే రాధలా అందరి దృష్టిని ఆకర్షించింది శ్రీ లీల. అందులో భాగంగానే మల్టీకలర్ లెహంగా ధరించిన ఈమె రాధా గెటప్ లో అందరి దృష్టిని ఒక్కసారిగా తనవైపు తిప్పుకుంది. హెవీ జువెలరీతో పువ్వుల మధ్యలో విరబూసిన జాజిల తన సోయగాలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. పూల మధ్యలో పుత్తడి బొమ్మ.. అందాల సోయగాన్ని చూడతరమా అనే రేంజ్ లో అభిమానులు కవిత్వాలు వల్లిస్తున్నారు. మొత్తానికైతే అసలైన రాధా గెటప్ లో శ్రీలీల అబ్బురపరుస్తోంది అంటూ నెటిజన్స్ చేస్తున్న కామెంట్లు కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆ వైబ్ ఏమాత్రం తగ్గట్లేదు అనేలా శ్రీ లీల మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. మొత్తానికి అయితే రాధా గెటప్ లో శ్రీ లీల షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. భారతీయ సంతతికి చెందిన అమెరికన్ నటి అయిన శ్రీ లీల తెలుగు చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తోంది. తొలిసారి చిత్రాంగదా అనే చిత్రంలో బాల కళాకారిణిగా తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. కిస్ అనే కన్నడ చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది.. ఈ చిత్రాన్ని తెలుగులో ఐ లవ్ యు ఇడియట్ అనే పేరుతో విడుదల చేశారు. 2021లో వచ్చిన పెళ్లి సంద సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. ధమాకా సినిమాతో ఊహించని బ్లాక్ బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇక తర్వాత స్కంద, భగవంత్ కేసరి, ఆది కేశవ , ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ , గుంటూరు కారం, రాబిన్ హుడ్, జూనియర్, మాస్ జాతర ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ అనుకున్నంత స్థాయిలో స్టార్ స్టేటస్ ఈమెకు లభించలేదు. ముఖ్యంగా పుష్ప 2 : ది రూల్ చిత్రంలో కిస్సిక్ పాటలో స్పెషల్ సాంగ్ చేసి అబ్బురపరిచింది. అటు తమిళంలో చేసిన పరాశక్తి సినిమా కూడా మంచి గుర్తింపు అందివ్వలేదు. ప్రస్తుతం హిందీలో ఒక సినిమా చేస్తోంది. అలాగే ఉరి అనే మరో చిత్రంలో కూడా భాగమయ్యింది. సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న శ్రీ లీలాకు ఈ

## చైతూ వృషకర్మకు ఇదే పెద్ద సమస్య..
# ఆలస్యం ఎంత వరకు?

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ'. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలే ఉన్నాయి. దాదాపు ఆరు నెలల క్రితం విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అయితే ఆ తర్వాత నుంచి ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో అక్కినేని అభిమానులు, ప్రేక్షకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ సినిమా ఎప్పుడు వస్తుందో చెప్పకపోవడంపై చిత్ర యూనిట్‌పై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. ఆ వివరాలు చూద్దాం.. ఈ సినిమాను దసరా కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. విజువల్ ఎఫెక్ట్స్ పనుల వేగంపై ఆధారపడి రిలీజ్ డేట్ ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాకపోవడంతో దసరాకి ఈ సినిమా రావడం కష్టమేనని ప్రచారం జరుగుతోంది. ఇక దసరా వంటి పెద్ద పండుగ సీజన్‌ను మిస్ చేసుకోవడం సినిమా బిజినెస్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. డిసెంబర్‌లో తండ్రీ కొడుకుల మధ్య వార్? దసరా కాకపోతే డిసెంబర్ మూడో లేదా నాలుగో వారంలో వృషకర్మను విడుదల చేయవచ్చని ప్రచారం నడిచింది. అయితే అక్కినేని నాగార్జున మైలురాయి చిత్రం 'కింగ్ 100' డిసెంబర్ 24ను లాక్ చేసుకుంది. ఒకే పండుగ సీజన్ లేదా సెలవుల సమయంలో తండ్రీకొడుకులు బాక్సాఫీస్ వద్ద పోటీ పడే అవకాశం ఏమాత్రం లేదు. రెండు సినిమాలకు థియేటర్లు, కలెక్షన్లు పంచుకోవడం ఇష్టం లేక వృషకర్మ మళ్లీ వెనక్కి తగ్గాల్సి వస్తోంది. ఇక దీంతో ఈ సినిమా రిలీజ్ డేట్ మరింత గందరగోళంగా మారింది. వరుస అప్‌డేట్స్ లేకపోతే కష్టమే: కార్తీక్ దండు టేకింగ్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణ, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్ కాంబినేషన్ వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మంచి బజ్ ఏర్పడింది. చైతన్య సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. అయితే ఎంత మంచి కంటెంట్ ఉన్నా, సరైన సమయంలో అప్‌డేట్స్ ఇవ్వకపోతే ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఆరు నెలల సమయం దాటిపోవడంతో, మిగతా కొత్త సినిమాల వైపు ప్రేక్షకుల దృష్టి మళ్లుతోంది. సినిమా ఆలస్యమయ్యే కొద్దీ ఆడియన్స్‌లో హైప్ తగ్గుతుంది. చైతూ కెరీర్‌కు కీలకం: నాగచైతన్య కెరీర్‌కు ఈ సినిమా విజయం చాలా అవసరం. ఇటీవల వచ్చిన 'ఇరుముడి' తరహాలోనే వృషకర్మ కూడా బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ అయి చైతూ మార్కెట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఇక వీఎఫ్ఎక్స్ క్వాలిటీ కోసం మేకర్స్ సమయం తీసుకోవడం మంచిదే అయినప్పటికీ, కనీసం ఆ వివరాలను అభిమానులతో పంచుకోవాల్సిన అవసరం ఉంది. సైలెంట్‌గా ఉంటే బిజినెస్‌కే నష్టం జరుగుతుంది. మొత్తానికి ఇక 'వృషకర్మ' సినిమా చుట్టూ ఉన్న సైలెన్స్ ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఆరు నెలలుగా సైలెంట్‌గా ఉన్న చిత్ర యూనిట్ ఇప్పటికైనా మేల్కొని రిలీజ్ డేట్‌పై ఒక స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి మేకర్స్ ఈ అసంతృప్తిని గ్రహించి త్వరలోనే ఏదైనా క్రేజీ అప్‌డేట్ ఇస్తారో లేదో చూడాలి.





# బ్లాక్ అండ్ బోల్డ్ లుక్‌లో రాశీ ఖన్నా.. కుర్రాళ్ల గుండెల్లో హీట్ పెంచేస్తున్న పిక్స్!



టాలీవుడ్ అందాల భామ రాశీ ఖన్నా తన గ్లామర్‌తో, నటనతో సోషల్ మీడియాలో నిత్యం హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పోస్ట్ చేసిన గ్లామరస్ ఫోటోషూట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. 'ఆఫ్టర్ అవర్స్' అంటూ ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ పిక్స్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. మినిమలిస్ట్, కాంటెంపరరీ మోడరన్ లుక్‌లో రాశీ ఖన్నా ఇచ్చిన కిల్లింగ్ ఫోజులు ఇప్పుడు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. విశేషాలు చూద్దాం.. ఇంకో వారం బ్లాక్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతున్న రాశీ: తాజా ఫోటోషూట్ కోసం రాశీ ఖన్నా ఒక విభిన్నమైన బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. షీర్ ప్యానెల్స్ డిజైన్‌తో ఉన్న హాల్టర్ నెక్ బాడీసూట్, దానికి తగ్గట్టుగా హై-వేస్టెడ్ ట్రౌజర్స్ ధరించి స్టైలిష్‌గా మెరిసిపోయింది. ఇక ఫిట్‌గా ఉండే ఈ డ్రెస్సులో ఆమె గ్లామర్ మరింత ఎలివేట్ అవుతోంది. ఈ సింపుల్ అండ్ క్లాసీ లుక్ ఆమె అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. స్టైలింగ్ వెనుక పెద్ద టీమ్: ఈ అదిరిపోయే స్టైలిష్ లుక్‌ను సెలబ్రిటీ స్టైలిస్ట్ షీఫా జిలానీ చాలా పర్‌ఫెక్ట్‌గా క్యూరేట్ చేశారు. రాశీ ఖన్నాకు సూట్ అయ్యేలా హెయిర్, మేకప్‌ను సారా సాయా మరియు సంజన జి అందించగా, ప్రముఖ ఫోటోగ్రాఫర్ అమన్ అగోషే తన కెమెరాతో ఈ అందమైన పిక్స్‌ను క్యాప్చర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. తెలుగులో వరుస క్రేజీ ప్రాజెక్టులు: గ్లామర్‌తోనే కాకుండా నటనతో కూడా రాశీ ఖన్నా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్లు అందుకుంటోంది. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన నటించిన 'తెలుసు కదా' రొమాంటిక్ డ్రామాతో పాటు, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన భారీ యాక్షన్ మూవీలో కీలక పాత్ర పోషించి మెప్పించింది. ఇక తెలుగులో అగ్ర కథానాయకుల సరసన నటిస్తూ తన మార్కెట్‌ను పెంచుకుంటోంది. తమిళంలోనూ బిజీ బిజీ: తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ భాషల్లోనూ రాశీ ఖన్నాకు మంచి డిమాండ్ ఉంది. సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో కమల్ హాసన్ నిర్మిస్తున్న 'ధర్మన్' మూవీలో నటిస్తోంది. అలాగే సిద్ధార్థ్ సరసన 'రౌడీ ఉ కో' చిత్రంలోనూ, ఆర్. మాధవన్‌తో కలిసి 'బ్రిడ్జ్' అనే టైమ్ ట్రావెల్ సస్పెన్స్ థ్రిల్లర్‌లోనూ నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో మెరిసిపోతోంది. గ్లామరస్ ఫోటోషూట్‌లతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయడం మాత్రమే కాదు, పాత్రల ఎంపికలోనూ రాశీ ఖన్నా వైవిధ్యం చూపిస్తోంది. అన్ని భాషల్లోనూ చేతినిండా సినిమాలతో దూసుకుపోతున్న ఈ భామ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.